POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
అక్టోబర్ 2022
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 06



శ్రీ శిరిడి సాయిబాబా మహాసమాధి

విజయదశమి (5-10-2022)

సంపుటి:40 అక్టోబరు - 2022 సంచిక:06

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సాయిబాబా

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన

ఏకైక పత్రిక, మన ''సాయిబాబా''

ఆరంభంలో పూజ్యశ్రీ అమ్మగారి జన్మదిన మహోత్సవము (1-10-2022), మధ్యలో పూజ్యశ్రీ సాయినాథుని ఆరాధనా మహోత్సవమైన విజయదశమి (05-10-2022), చివరిలో పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదిన మహోత్సవము (30-10-2022) ఉన్న ఈ అక్టోబర్ నెలలో శ్రీ సాయిమాస్టర్ భక్త జనులకు చక్కని స్మరణ జరిగేలా ఉపయోగపడే ప్రత్యేక సంచిక!!

మానవాళికి అందిన మహిత వరం 'సాయిబాబా'	03
ఆశీస్సులు	06
భక్తులే పూర్వీకులైతే!	09
సంకుచిత మతద్వేషాల పరిధులు దాటించే సీమోల్లంఘనం!	14
మాతృదేవి స్మృతులు	17
గురుపత్ని మాతృశ్రీ అలివేలు మంగమ్మ	20
ద్వారకామాయి అనుభవమండపము	25
ఆచార్యుని అద్భుత లీలలు	27
మహనీయుల సమాధుల ప్రభావం	30

చిరునామా

SRI MANGA BHARADWAJA TRUST

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad, Telangana - 500068. Phone No. +91 - 74160 41550

Branch Office: Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dt. Andhra Pradesh. Phone No. 08592 233271

www.saibharadwaja.org

చందా వివరములు: విడి ప్రతి – 10.00 ; సంవత్సర చందా – 100.00

మానవాళికి అందిన మహిత వరం 'సాయిబాబా'

~పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

తలచిన హృదయాలలో ఆరని మంటలనార్పి, తీయని ప్రేమను కురిసే నామం సాయిబాబా. ప్రతిఫల మెరుగని ఆయన జీవితం పరిపూర్ణ జీవితానికి ప్రతీక. అలౌకికమైన నిష్ఠ, కఠిన నియమాలతోనూ సాగిన ఆయన జీవితం అనుసరణీయం మాత్రమేకాదు – నిత్యానుస్మరణీయం కూడా. ఆయన కోపం, కరుణ రెండూనూ ఫలితం దృష్ట్యా చూస్తే భక్తుల బాగుపట్ల ఆయన చూపే శ్రద్ధకే నిదర్శనాలు. అందుకే సాయిబాబా అంటే ఆయన భక్తుల దృష్టిలో దివ్యశక్తి తమపై కరుణతో దాల్చిన రూపం.

ఆయన భక్తులలో అన్ని మతాల, సాంప్రదాయాల వారూ ఉన్నారు. అన్నింటినీ తనలో ఇముడ్చుకొన్నదే సాయి సాంప్రదాయం. మతద్వేషంతో మంట గలుస్తున్న మానవాళికి మానవతా విలువల నొకవైపు బోధిస్తూ, అన్ని సాంప్రదాయాల ఆదర్శమూ, ధ్యేయమూ ఒకటేనని తన నిత్య జీవితాన్నే ఒక ఉదాహరణంగా నిలిపారు శ్రీసాయి.

సాయిబాబా ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి జన్మించారో నన్న విషయం ఇదమిత్థంగా తెలిసినవారు లేరు. మొదట 16 ఏళ్ళ వయస్కులుగా 1854 సం॥లో శిరిడీలో కన్పించారు. ఆ తరువాత 1918 విజయదశమి వరకూ శిరిడీలోనే వుండిపోయారు.

శ్రీసాయినాథుడు ఏ సాంప్రదాయం వారో నన్నది నిస్సందేహంగా చెప్పడమూ కష్టమే. ఆయనకు 'సాయిబాబా' అన్న పేరు భక్తులు పెట్టినదే. వేషానికి ఫకీరు, నియమానికి కఠిన బ్రహ్మచారి, సాంప్రదాయానికి సర్వసముదాయన. ఉన్నది పాడుబడిన మసీదులో. అందులో (పార్శీలకూ, హైందవులకూ ముఖ్యమైన) అగ్ని ఆరాధన, వాకిట తులసీ



బృందావనం. ఐదిళ్ళంటే ఐదే ఇళ్ళలో భిక్ష. తనవి అంటూ ఆయనకేమీ ఉండేవి కాదు – చేతిలోని దండం, చిలిమ్ గొట్టం, ఓ రేకు డబ్బా, జోలె, తొడుక్కొన్న పొడవైన పాత చొక్కా, తలగుడ్డ తప్ప! ఆ ఫకీరును ఆశ్రయించిన వారిలో పండితులు, కోటీశ్వరులు, అతి సామాన్యులు, మహాత్ములుగా ఎంచబడినవారూ ఉన్నారు. ఆ భిక్షకుని చూపుతో, మాటతో, స్పర్శతో లౌకికంగానూ ఆధ్యాత్మికంగానూ ఉన్నత స్థాయిని అందిన వారెందరో ఉన్నారు.

హీడాబేగ్, అన్వర్‌ఖాన్ అనేవారు ఆధ్యాత్మిక పరిణతి కొరకు బాబాను ఆశ్రయించారు. ఖురాన్ గ్రంథం నుంచి అరబ్బీ

ప్రార్థనలు వారికుపదేశించి బేగ్‌ను కనాడ్ వద్ద, అన్వర్‌ను బాగ్దాద్ లోనూ నిజమైన ఫకీర్లలా జీవించమని ఆశీర్వదించి పంపారు సాయి. ఢిల్లీ నివాసి యాకూబ్ అనే ముస్లిం సాధకుడు పవిత్రమైన బాబా సన్నిధిలో ఖురాన్ పఠించి పవిత్రుడయ్యాడు. హజరత్ దర్వేన్ షా (ఔరంగాబాద్), ఫకీర్ అమీరుద్దీన్ (నాందేడ్) వంటి ముస్లిం గురువులు తమ శిష్యులను సాధనలో మెలకువలు తెలుసుకొమ్మనీ, ఆశీర్వాదాలు పొందిరమ్మనీ బాబా వద్దకు పంపేవారు. గంగగిర్, మెహర్ బాబా వంటివారు సాయిబాబాను గూర్చి 'ఆయన కోహినూర్'. 'ప్రపంచాన్ని ఆధ్యాత్మిక పథంలో నడిపేందుకు ఉన్న 72 మంది గురువులలో ఐదుగురు గొప్పవారు. వారిలో సాయి తలమానికం వంటివారు. "నాకు ఆయనను గూర్చి తెలిసినంత మీకూ తెలిస్తే ఆయన ఈ సృష్టికే ఆదినాథుడని మీరే అంటారు' అన్న మాటలు అక్షరసత్యాలనడం స్వభావోక్తే.

తలచిన హృదయాలలో ఆరని మంటలనార్పి, తీయని ప్రేమను కురిసే నామం సాయిబాబా. ప్రతిఫల మెరుగని ఆయన జీవితం పరిపూర్ణ జీవితానికి ప్రతీక. అలౌకికమైన నిష్ఠ, కఠిన నియమాలతోనూ సాగిన ఆయన జీవితం అనుసరణీయం మాత్రమేకాదు - నిత్యానుస్మరణీయం కూడా.

కాశీనాథ్ ఉపాసనీశాస్త్రి (ఉపాసనీ బాబా, సాకోరి), నానాసాహెబ్ చందోర్కర్, మూలేశాస్త్రి, దాసగణు మహరాజ్ లాంటివారిని ఆయన (హైందవ) ఆధ్యాత్మిక సాధనపరంగా సానబెట్టారు. భగవద్గీతను భాష్యత్రయంతో సహా క్షుణ్ణంగా చదివాననే విద్యాగర్వంగల చందోర్కర్ గర్వాన్ని అతను వివరించలేని ఒక శ్లోకానికి (అధ్యాయము - 4-34 శ్లోకం) అసాధారణ వివరణనిచ్చి అణచారు ఆ 'చదువురాని' బాబా! అలాగే వేదపఠనం మధ్యలో మంత్రం మరచిన దక్షిణదేశ పండితులకా పనసలు అందించిన సాయికి ఖురానే వచ్చనందామా, వేదమే వచ్చనందామా!

మసీదులో శ్రీరామనవమి, గురుపూర్ణిమ, అలాగే మొహరమ్ వంటి ఉత్సవాలూ ఆయన అనుమతితో జరిగేవి. ఆ ఉత్సవాల్లో హిందూ ముస్లిం అనే తేడాలేక అందరూ ఒకే తల్లి బిడ్డల్లా కలసి మెలసి పాల్గొనడం ఈ శతాబ్దంలోనే జరిగిన సత్యం! విచిత్ర మేమీకాదు!!

ఆయన 'అల్లా మాలిక్' అనీ, 'అల్లా అచ్చాకరేగా' అనీ అంటూండేవారు. తన గురువు రోషన్ షా అని కొందరితో, వెంకూసా అని కొందరితో చెప్పేవారు. హరినామం చేసి చేసి హరినయ్యానన్నారు. రాముడు, కృష్ణుడు మొ॥నవారు చారిత్రక పురుషులనేవారు. అలాగే జ్ఞానేశ్వరీ భగవద్గీత, భాగవతం, విష్ణు సహస్రనామం, గురుచరిత్ర పారాయణ చేయమని భక్తులకు చెప్పేవారు. తానున్న మసీదుకు 'ద్వారకామాయి' అని పేరు పెట్టారు. హిందూ భక్తులాయనను దత్తావతారంగా కొలిచేవారు.

బాబా మత ద్వేషాన్ని సహించేవారుకాదు. మతమౌఢ్యం కలిగిన ఒక ముస్లిం మసీదులో నిద్రిస్తూన్న హిందువులను చూపుతూ వారు ఇస్లాం సాంప్రదాయాన్ని, మసీదునూ పూజాదికాలతో అపవిత్రం చేస్తున్నారనీ, కనుక వారినందరనూ చంపుతాననీ బాబాతో అన్నాడు. అందుకాయన "వారిని నేనే రమ్మన్నాను. అలా చేయమని ప్రోత్సహించాను. కనుక నన్ను సంహరించడం సరైన పని" అని అడ్డుపడ్డారు. దానితో ఆ వ్యక్తి మరలిపోయాడు. అలాగే ఓ రోహిల్లా రాత్రులందు 'అల్లాహో అక్బర్' అని అరుస్తూ తమ నిద్రకు భంగం కల్గిస్తున్నాడని హిందువు లారోపించగా అతని సాంప్రదాయబద్ధమైన ప్రార్థనా విధిని నిరసించడం సబబు కాదని బాబా మందలించారు. ముస్లిం మతం స్వీకరించిన ఒక యువకుడిని లాగి చెంపదెబ్బ కొట్టి "అబ్బను మార్చుకొన్నావటరా!" అని మండిపడ్డారు. మరోమారు చక్రనారాయణ అనే క్రైస్తవ ఉద్యోగి బాబా స్వీకరించే దక్షిణల వివరం సేకరించేందుకు ప్రభుత్వ ప్రతినిధిగా రాగా అతనిని భక్తులు దుయ్యబట్టారు. వారు అతనిని అలా విమర్శించినందుకు బాబా వారిని తీవ్రంగా నిరసించారు. పరదూషణ చేసే ఒకనికి పందిని చూపుతూ బాబా, "అది చేసే పనే నీవూ చేస్తున్నావు. ఇలా ఐతే శిరిడీ వచ్చి ఏం ఉపయోగం?" అని మందలించారు. మత సహనం, మతాలన్నింటికీ మూలమైన సత్యం ఆయనకు ప్రధానం.

బాబా జీవితం సాధువుల, మహాత్ముల జీవితం ఎలా



ఉండాలో చెప్పే ప్రత్యక్ష ప్రమాణం, ఆదర్శం. తమ సిద్ధాంతాలే గొప్పవని వాటిని సామాన్యులపై రుద్దే ఎందరో బాధ గురువుల, ఆచార్యుల, భగవానుల బారి నుండి రక్షించి నిజమైన బోధ గురువులను ఎంచుకొనేందుకు పనికివచ్చే గీటురాయి ఆయన జీవితం. వారి జీవితంలో వ్యక్తమయ్యే నాలుగంశాలు పేర్కొని తీరాలి:

1. హిందూ భక్తులకు బాబా వారి వారి ఇష్టదైవాలైన రామ, విఠల, దత్త, మారుతి రూపాలలోనూ, శ్రీ అక్కల్‌కోట స్వామి, గురుఘోలప్ స్వామి మొ॥న గురువుల రూపంలోనూ దర్శనం ఇచ్చారు. అన్ని జీవులలోనూ, అన్ని ప్రదేశాలలోనూ తన ఉనికిని నిరూపించాయి ఆయన లీలలు. ఆనాటి మహాత్ములే ఆయనకు చెయ్యెత్తి మొక్కారు, కోటీశ్వరులాయన వాకిట నిలిచారు. ఐనా "నేను భగవంతుని బానిసను. పేద ఫకీరును" అనే వారాయన. "నేనే భగవంతుడిని" అనే నకిలీ బాబాలకూ, 'మహాత్ములకూ' ఆయనకూ ఎంత తేడానో! ఆయన సముద్రం, వారో మురికి కాల్వలు.

2. "రేపటిగూర్చి ఆలోచించకు" అన్న క్రీస్తు సందేశాన్నీ – నిజమైన సాధువుకు ఆశ్రమ మఠాది నిర్మాణం, శిష్యకోటిని కూర్చుకోవడం, తన కొరకుగానీ, పవిత్ర కార్యాలకనిగానీ, ధన వస్తు సముదాయాన్ని సేకరించడం, సన్మానాదుల నందుకొనడం నిషిద్ధమని చెప్పిన హిందూ శాస్త్ర గ్రంథాలలోని నియమాలను – ఈయనవలె ఎందరు పాటించారు? రోజూ సాయంకాలం వరకూ భక్తులిచ్చే దక్షిణల మొత్తాన్ని (ఆ రోజులలోనే సుమారు 3-4 వందల రూపాయలుండేది!) తినుబండారాలనూ, విలువైన వస్త్రాలనూ ఆ రోజుకారోజే పేదలకు పంచేవారు బాబా. తన కోసం జోలెతో ఐదిండ్ల భిక్ష చేసేవారు. అందుకే ఈనాటి నకిలీ స్వాములలాగా ఆయన 'ధనస్వాములు' కాలేకపోయారు.

3. భక్తులాయనకు ఒక పల్లకీ, గుఱ్ఱం, రథం – అన్ని హంగులూ సమకూర్చారు. ఐనా శిరిడీలో ఆయన ఉన్న అరువదేండ్లలోనూ ఒక్కసారి కూడా వాటిని ఆయన వినియోగించక, చెప్పులు కూడా ధరించక చిరిగిన గుడ్డలతోనే ఊరంతా తిరిగేవారు. అడుగు దూరం వెళ్ళాలన్నా విదేశీ కాడిలాక్ కార్లు కావాలనే ఈ 'మహాత్ముల' వరుసలో ఆయనెలా నిలబడగలరు!

4. ఇతర మహాత్ములంతా మోసగాళ్ళు, గారడీలవారు, హిప్నొటిస్టులు అని ఇతరులపై బురద చల్లుతూ, పైగా తాను తప్ప తరింపజేయగలవాడు లేడనే ఈ కుహనా మహాత్ములకూ, "నీ గురువునే అచంచలమైన విశ్వాసంతో అట్టి పెట్టుకో, ఆయన సామర్థ్యం ఎంత తక్కువదైనా సరే" అని బోధిస్తూ ఆరతిలో తుకారామ్ వంటి మహాత్ముల గూర్చిన పాటలు భక్తులు పాడే సమయంలో ఎంతో భక్తిగా చేతులు జోడించి వినయంగా కూర్చొనే బాబాకూ సాపత్య మెక్కడ? వీరికి ఆయన జీవితమే ఒక గుణపాఠం.

బాబా చూపిన బాటలో నడుద్దాం!
ఆయన బిడ్డల మనిపించుకొందాం!!
ఆయన కృపకు అర్హుల మౌదాం!!!

ఆశీస్సులు

(పూజ్య ఆచార్య భరద్వాజ గురుదేవుల జన్మదిన ప్రత్యేక వ్యాసం)

~పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

ఆరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు. ఆ రోజు ఎంతోమంది ఆయన దర్శన ఆశీస్సులు కోసం వచ్చారు. ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన అనుగ్రహభాషణలో ఆయనిలా అన్నారు : "ఇంతమంది రూపంలో శ్రీ సాయినాథుడు తమ ఆశీస్సులను నాకందిస్తున్నందుకు నాకెంతో ఆనందంగా వుంది".

పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదిన సందర్భంగా ఆయన ఆశీస్సులకోసం వచ్చినవారి ఆశీస్సులు తమకు లభించాయని ఆయన భావించడమేమిటి? పూజ్యశ్రీ మాస్టరుగారు పలికిన మాటలలో ఎంతో అర్థం వుంది. అందరి ఆశీస్సులు తప్పకుండా మనకు వుండాలని మనం కోరుకోవాలని అర్థం. అయితే అసలు ఎవరి ఆశీస్సులైనా ఎందుకు కావాలి? అసలు ఆశీస్సులంటే ఏమిటి? అనే విషయాలను గూర్చి ఆయన చెబుతున్నారు.

పెద్దలు మనకు శుభం జరగాలని హృదయపూర్వకంగా కోరుతూ ఆశీస్సులిస్తారు. అలా ఇచ్చిన ఆశీస్సులవల్ల మనకు శుభం జరుగుతుందని పెద్దలు చెబుతారు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే అట్లా హృదయపూర్వకమైన ఆశీస్సులు పొందాలంటే అలా ఆశీస్సులు యిచ్చేవారి పట్ల మన ప్రవర్తన, భావము ఎలా వుండాలన్నదే మనం ఆలోచించాలి.

అసలు పెద్దలంటే ఎవరు? మనకంటే వయసులో పెద్దవారు అని మనమనుకుంటాము. అది నిజమే. కాని మనకంటే పెద్దలు చాలామంది వుంటారు. ఇక్కడ 'మనకంటే' అంటే వయసులోనే కాదు, ఏ విషయంలోనైనా సరే మనకంటే పెద్దలు వుంటారు అని అర్థం. మనకు తెలియని



దానిని తెలుసుకున్నవారెవరైనా మనకు పెద్దలే. అప్పుడు వయసులో చిన్న, పెద్ద అందరూ పెద్దలే. ఇంకా ఆలోచిస్తే మనకంటే ఈ సృష్టిలో ప్రతిదీ పెద్దదే. కారణం సృష్టిలో ప్రతిదీ మనకు తెలియని ఏదో ఒక విషయాన్ని తెలుపుతుంది గనుక. అటువంటి పెద్దలపట్ల మన ప్రవర్తన, మాట వారిని సంతోషపరచేవిగా వుండాలి. ఇక్కడ 'పెద్దలు' అంటే అందరూ పెద్దలే అనుకున్నాం గనుక ప్రతివారి పట్ల మన ప్రవర్తన అలానే వుండాలి. మానవుల పట్ల మాత్రమే కాదు, సకల జీవులపట్ల కూడా అలానే వుండాలి.

తమను ఎవరైనా గురువుగా భావించినా ఆయన ఒప్పుకునేవారు కాదు. "అందరికీ గురువు ఆ సాయినాథుడే. ఆయనను ఎదురుగా పెట్టుకుని గురువునని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి" అనేవారు. అలాగని ఆయనను బాబా తన శిష్యుడని అంగీకరించినప్పటికీ ఆయన మాత్రం ఇలా అనేవారు: "ఆయన శిష్యులమని చెప్పుకోవడానికి గుండే? చెరువా?"

అందరూ పెద్దలు ఎలా అవుతారు? చిన్నపిల్లలు, ఇతర జీవులు మనకంటే పెద్దలు ఎలా అవుతారు? అని మనకనిపించవచ్చు. ఆలోచిస్తే ఇది ఎంత సరియైనదో మనకే అర్థమౌతుంది. ఉదా॥ పసిపిల్లలను సంతోషపెట్టా మనుకుందాము. వారిలో వున్నదెవరు? అన్ని జీవులలోవున్న సాయి మనకంటే పెద్దవారే కదా? లేక ఆత్మదృష్టితో చూసినా ఆత్మ అందరిలో ఒక్కటే. అది చిన్నది ఎప్పటికీ కాదు. ఎప్పుడూ గొప్పదే. అదే సాయి. అప్పుడు అందరిలో వున్న సాయిని సంతోషపరచినట్లే కదా! మనం చేసిన ప్రతి చర్యకు ప్రతిచర్య చేయడం సృష్టి యొక్క తత్త్వం. అందుకే పసిపిల్లలనైనా సరే మనం కోప్పడినా, దండించినా వారి హృదయం క్షోభిస్తుంది. అందుకు ప్రతిఫలం మనం అనుభవించవలసినదే. పిల్లలనైనా, ఎవరినైనా వారి మంచి కోసం దండించడం తప్పుకాదు. కానీ దానికి ఒక హద్దు వున్నది. దానిని మించి ఏదైనా చేస్తే తప్పక ఫలితం అనుభవించి తీరాలి. వారి హృదయవేదన మనలను శపిస్తుంది. అప్పుడు ఆశీర్వచనాలెలా వస్తాయి? శిక్షలే వస్తాయి.

అందుకే సజ్జనులు ఎవరినీ కష్టపెట్టరు. ఇందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ఉదాహరణ. ఆయన చిన్నప్పటినుంచీ కూడా అందరి శ్రేయస్సునే కోరేవారు. అందరికీ సహాయం చేసేవారు. ఎవరు, ఎప్పుడు ఏ విధమైన ఇబ్బంది పడినా సహించలేకపోయేవారు. పెద్దైన తరువాత కూడా ఆయన ఎందరికో ఆర్థిక సహాయం చేశారు. మాట సహాయం చేశారు.

జ్ఞానదానమే అన్నింటికంటే శ్రేష్ఠమైనదని తెలిసినప్పటికీ విద్యాదానం కూడా చేశారు. చివరకు సకల జీవుల శ్రేయస్సుకై ఆయన ఎన్నో విధాల ప్రయత్నించారు. అప్పుడు అందరి హృదయాలు ఆనందింపక ఎలా వుండగలవు? అంతేకాదు. ఆయన అందరిలోనూ తమ గురువునే చూసుకున్నారు. అందుకే మహాత్ములందరి ఆశీస్సులు ఆయనకు పుష్కలంగా లభించాయి.

పూర్ణానందస్వామి విద్యానగర్ వచ్చినప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు వారి ఆశీస్సులు కోరారు. అప్పుడు పూర్ణానందస్వామి ఇలా అన్నారు: "నీవు నా ఆశీస్సులు కోరడమా! శ్రీ సాయినాథుని ఆశీస్సులు పొందిన నీకు ఎవరి ఆశీస్సులు అవసరం లేదు. మహాత్ములందరి ఆశీస్సులూ నీకున్నట్లే!"

అలాగే పూర్ణానందస్వామి యొక్క గురువైన శ్రీ రాఖాడీ బాబా పూజ్యశ్రీ మాస్టరుగారితో ఇలా అన్నారు: "బాల శివా! నీ తండ్రి అయిన సాయినాథుని ఆశీస్సులు ఎంతో గొప్పవి. నీకు అనసూయామాత ఒడిలో నిద్రించే యోగ్యత లభించింది. ఈ రోజు ఆమె ఒడిలో హాయిగా నిదురించు." అనసూయమాత ఒడిలో నిద్రించే యోగ్యత ఎంతటివారికి లభిస్తుందో మనం ఊహించుకోవచ్చు. అంతే కాదు. తమ ఆశీస్సులు ఎప్పుడూ వుంటాయని గూడ శ్రీ రాఖాడీ బాబా చెప్పారు.

అంతేకాదు. ఆయన దర్శించిన మహాత్ములందరూ ఆయనకు అశీస్సులందించారు. అనుగ్రహాన్ని వర్షించారు.


అయినప్పటికీ పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడూ తన గురించి గొప్పగా చెప్పుకునేవారు కాదు. ఎవరైనా తమను గొప్పగా భావిస్తే, "నేనెంతటివాడిని? నేను మిఠాయి మీద చుట్టిన కాగితం లాంటివాడిని. అందులో వుండే మిఠాయి సాయినాథుడు. ఆ మిఠాయి లేకపోతే ఇందులో ఏమున్నది? అంతా డొల్లే" అనేవారు. తనకింతమంది మహాత్ముల ఆశీస్సులు లభించినా ఆయన గర్వపడలేదు. వారి అనుగ్రహాన్ని పొందడానికి ఇంకా ఇంకా ప్రయత్నిస్తూనే వుండేవారు. ఎవరి దగ్గరకు వెళ్ళినా 'తమరి ఆశీస్సులు ఎప్పుడూ వుండాల'ని చేతులు జోడించి వినమ్రతతో ప్రార్థించేవారు. ఆయనింకా ఇలా అనేవారు, "నేను మీకంటే ముందే శిరిడీ వెళ్ళాను. కనుక అక్కడికి చేరే మార్గాన్ని తెలిపేవాడిని మాత్రమే" అని.

తమను ఎవరైనా గురువుగా భావించినా ఆయన ఒప్పుకునేవారు కాదు. "అందరికీ గురువు ఆ సాయినాథుడే. ఆయనను ఎదురుగా పెట్టుకుని గురువునని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి" అనేవారు. అలాగని ఆయనను బాబా తన శిష్యుడని అంగీకరించినప్పటికీ ఆయన మాత్రం ఇలా అనేవారు: "ఆయన శిష్యులమని చెప్పుకోవడానికి గుండే? చెరువా?"

అంటే ఆయన తమను తాము ఎంత తగ్గించుకునేవారో వీటిని బట్టి అర్థమౌతుంది. "తమను తాము తగ్గించుకొనువారు హెచ్చింప బడుదురు" అన్న ఏసుక్రీస్తు సూక్తి ప్రకారము ఆయన మహాత్ముల దృష్టిలో ఎంతగా హెచ్చింప బడ్డారో అర్థమౌతుంది.

అందుకే శ్రీ రాఖాడీ బాబా, శ్రీ గుళవణి మహరాజ్ వంటివారు ఆయనను 'సాయిబాబా బిడ్డ' అని చెప్పారు.

ఇప్పుడు మనం చెప్పుకున్నదానిని బట్టి



పూజ్యశ్రీ మాస్టరుగారి మాటలను బట్టి, చర్యలను బట్టి మనమెలా వుండాలో మనమాలోచించుకోవాల్సిన అవసరం మనకు ఎంతైనా వుంది. మనకు పెద్దల ఆశీస్సులు వుండాలంటే పూజ్యశ్రీ మాస్టరుగారు అందరిపట్ల ఎలా వుండేవారో, పెద్దలపట్ల ఎంతటి వినమ్రతతో వుండేవారో మనం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అందుకని అంతటివారైన పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు పండుగ సందర్భంగా మనం వారి ఆశీస్సులు కోరుకుందాము. ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ మనపై వర్షించాలని మనసారా ప్రార్థిద్దాము.

జై సాయి మాస్టర్ !

భక్తులే పూర్వీకులైతే!

(పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ జన్మదిన ప్రత్యేక వ్యాసం)

~వేదమ్మ

పూజ్యశ్రీ అమ్మగారి గురించి ఆలోచించినప్పుడల్లా ఆమె అనన్యచింతన, భక్తి, శ్రద్ధ, సేవలు గుర్తుకువస్తాయి. ఆమెను స్మరించగానే ధీర గంభీర ప్రశాంత కోమలమైన ఆమె రూపం హృదయానికి గోచరిస్తుంది. పులకింపచేస్తుంది. ఆమెలోని ప్రతి అంశమూ ఎంతో ప్రత్యేకమైనది. మార్గదర్శకమైనది.



పూజ్యశ్రీ అమ్మగారి జననం ఎంతటి ప్రత్యేకమైనదో, మార్గదర్శకమైనదో స్మరిద్దాము. పూజ్యశ్రీ అమ్మగారు అక్టోబర్ 1, 1945 న గుంటూరు జిల్లాలోని పొన్నూరు దగ్గర వున్న మన్నవ అనే గ్రామంలో జన్మించారు. దానధర్మాలకు, భక్తికి పేరుగాంచిన కుటుంబంలో శ్రీ మన్నవ బాలకృష్ణశర్మ, శ్రీమతి రంగనాయకి అనే పుణ్యదంపతులకు పూజ్యశ్రీ అమ్మగారు జన్మించారు.

తరతరాలుగా భగవచ్చింతన, ఆధ్యాత్మిక ఉన్నతి, ధర్మబద్ధ జీవితము కలిగిన కుటుంబాలలో మహాత్ములు జన్మించడం చరిత్రలో చూస్తాము. అలాగే ఎంతోమంది సాధకులు, భక్తులు, యోగులు కల వంశంలో పూజ్యశ్రీ అమ్మగారు జన్మించారు. మహాత్ములు జన్మించిన వంశంలో ఏడు తరాల వారు ఉద్ధరింపబడతారని శాస్త్రాలు చెబుతాయి. కనుక అందుకు అర్హత కలిగిన జీవులే మహాత్ములకు పూర్వీకులుగా జన్మిస్తారన్నమాట! వారంతా వారి వంశంలో మహాత్ములు జన్మించడం చేత ఉత్తమ గతులను పొందుతారు. పూజ్యశ్రీ అమ్మగారి జననం వలన ఆ వంశంలోని ఎందరు, ఎలా ఉద్ధరింపబడ్డారో ఎవరికి ఎరుక? కనుక అటువంటి అర్హులైన పూర్వీకులను తరింపచేయటానికి మహాత్ములు జన్మించడం కూడా అపారకరుణతో కూడిన వారి అనుగ్రహమే అన్నమాట!

పూజ్యశ్రీ అమ్మగారి తండ్రిగారైన శ్రీ మన్నవ బాలకృష్ణశర్మగారు నిరంతరం రామనామం జపించేవారు. ఆయన చాలా గొప్ప కవి. ప్రముఖ తెలుగు కవి అయిన శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు వీరి వద్ద కవిత్వంలోని మెలకువలను, రచనావిధానాన్ని నేర్చుకున్నారంటే ఆయన

ఎంతటి కవితా పటిమ కలవారో అర్థమవుతుంది. ఆయన వారసత్వంగానే పూజ్యశ్రీ అమ్మగారికి, వారి సోదర సోదరీమణులందరికీ పాటలు, పద్యాలు వ్రాసే కవితాసామర్థ్యం, చక్కటి రచనాశైలి అబ్బింది. అయితే శ్రీ బాలకృష్ణశర్మగారు గాని, ఆయన సంతానం గానీ ఆ సామర్థ్యాన్ని కీర్తి కోసమో, ధనం కోసమో వాడుకోలేదు! హృద్యమైన కవితలు వ్రాసి మంచి కవులుగా పేరు పొందాలనో, గొప్ప నవలలు వ్రాసి డబ్బును, పేరును సంపాదించాలనో భావించలేదు. అసలు కీర్తి, ధనాలపట్ల వ్యామోహం లేనివారే అందరూ! ఆ కుటుంబంలో ఆస్తి గొడవలు లేనే లేవు! బంగారము, స్థిర, చరాస్తులు కూడపెట్టాలనే దృష్టి లేనేలేదు! తమకు భగవత్ప్రసాదంగా లభించిన రచనా పాటవాన్ని, కవితా పటిమను భగవంతుని కీర్తించడానికే ఉపయోగించారు. పూజ్యశ్రీ అమ్మగారు కూడా బాబా మీద, పూజ్యశ్రీ మాస్టరుగారి మీద ఎన్నో పాటలను, భజనలను, వ్యాసాలను, గ్రంథాలను వ్రాశారు. పూజ్యశ్రీ అమ్మగారి తండ్రిగారైన శ్రీ బాలకృష్ణ శర్మగారు, ఆమె అన్నగారు కూడా శ్రీ జిల్లెళ్లమూడి అమ్మకు భక్తులై తమ కవిత్వంతో ఆమెను సేవించారు. పూజ్యశ్రీ అమ్మగారి సోదర సోదరీమణులు సాయి మీద, పూజ్యశ్రీ మాస్టరుగారి మీద, పూజ్యశ్రీ అమ్మగారి మీద ఎన్నో పాటలు వ్రాశారు. అలా భగవత్ప్రసాదంగా తమకు సంక్రమించిన కళలను భగవంతుని సేవకై వినియోగించడం వారి కుటుంబంలోనే సంస్కారంగా వున్నది.

> **పూజ్యశ్రీ అమ్మగారి గురించి ఆలోచించినప్పుడల్లా ఆమె అనన్యచింతన, భక్తి, శ్రద్ధ, సేవలు గుర్తుకువస్తాయి. ఆమెను స్మరించగానే ధీర గంభీర ప్రశాంత కోమలమైన ఆమె రూపం హృదయానికి గోచరిస్తుంది. పులకింపచేస్తుంది. ఆమెలోని ప్రతి అంశమూ ఎంతో ప్రత్యేకమైనది. మార్గదర్శకమైనది.**

శ్రీ మన్నవ బాలకృష్ణశర్మగారు స్కూల్ టీచర్ గా ఉద్యోగం చేస్తూనే వీలు దొరికినప్పుడల్లా కుటుంబసభ్యులకు రామాయణ, భారత, భాగవతాలు చదివి వినిపించడం, నేర్పించడం చేసేవారు. అందుకే మా అమ్మమ్మకు – అంటే శ్రీ రంగనాయకమ్మగారికి, ఆమె సంతానానికి అవన్నీ కంఠతఃవచ్చు. పూజ్యశ్రీ అమ్మగారు కూడా అప్పుడప్పుడు మాకు ఆ పద్యాలు పాడి వినిపించేవారు. శ్రీ బాలకృష్ణశర్మగారు తమ పిల్లలతో, "మీరు నవలలు, పత్రికలు చదవకండి. సినిమాలు, నాటకాలు చూడకండి. భోగభాగ్యాలు మనకొద్దు! అవి మనసును పాడు చేస్తాయి. భక్తిమార్గమే మనకు సరైనది. దానినే నమ్ముకోండి! రామాయణ, భారత భాగవతాలు చదవండి. అవే మనకు దిక్కు!" అని చెప్పేవారు.

శ్రీ మన్నవ బాలకృష్ణశర్మగారు మంచి శారీరిక దారుఢ్యం కలిగినవారు కూడా. అదుపు తప్పిన ఎడ్లను లొంగతీయడం, గుండెల మీద రోలు పెట్టించుకుని ఓట్లు దంపించుకోవడం చేసేవారంటే ఆయన ఎంతటి బలశాలో అర్థమవుతుంది. అంతేకాదు. ఆయనకు సర్వమత సామరస్యము, విశాల హృదయము ఉండేవి. ఆయన మంచి వక్త కూడా! అందరూ ఆయన చేత ఉపన్యాసాలు చెప్పించుకునేవారు. ఆడపిల్లలను చదివించడమే ఆ రోజుల్లో సమాజంలో పెద్ద తప్పుగా పరిగణింపబడేది. అదేమీ పట్టించుకోకుండా తమ కుమార్తెలందరినీ చదివించారాయన! స్త్రీలకు విద్య వుండాలని ఆయన నమ్మేవారు. తన భార్యకు కూడా ఆయనే చదువు నేర్పించారు. ఆయనకు ఒకసారి జబ్బు చేసినప్పుడు జిల్లేళ్లమూడి అమ్మ దర్శనమైంది. అప్పటినుంచి ఆయన ఆమెకు మహాభక్తులై తమ కవితలతో సేవించారు.

పూజ్యశ్రీ అమ్మగారి నాయనమ్మగారైన మన్నవ వెంకాయమ్మగారు ఎంతో సాత్వికురాలు. ఆమె గంగిగోవువంటివారని పూజ్యశ్రీ అమ్మగారు చెప్పేవారు. ఆమె దానధర్మాలకు పెట్టింది పేరు. అడిగినవారికి, అవసరమున్నవారికి లేదనకుండా సహాయం చేసేవారు. సేవ చేసేవారు. ప్రేమగా చూసేవారు. ఇంట్లో పాడి ఉండడంతో పాలు, పెరుగు, వెన్న, నెయ్యి నిరంతరం దానం చేస్తూనే ఉండేవారు. రాత్రి, పగలు కూడా ఆమె కుంపటి మీద వేడి నీళ్లు కాచుతూ వుండేవారు. మన్నవ గ్రామంలో ఎవరికి, ఏ సమయంలో వేడినీళ్లు అవసరమైనా వీరి ఇంటికి వచ్చి తీసుకువెళ్ళవచ్చు!



ఆమెకు దీనులపట్ల, పేదవారిపట్ల అమితజాలి! వారికి లేదనకుండా దానధర్మాలు, సహాయ సహకారాలు అందిస్తూ వుండేవారు. అంతేకాదు! ఆమె నిరంతరం భగవచ్చింతనలో వుంటూ శారీరక శ్రమ చేస్తూనే వుండేవారు. ఎవరో ఒకరికి ఎప్పుడూ పనులలో సహాయం చేస్తూనే వుండేవారు. ఆమెకు చక్కటి ఆధ్యాత్మిక చింతన ఉండేది. ఆమె రోజులో చాలాసేపు తీవ్రంగా ధ్యానం చేసుకుంటూ వుండేవారు. ఆమెకు ధ్యానంలో చంద్రదర్శనమైంది. అంతటి ఉన్నత ఆధ్యాత్మిక స్థితి కలిగినవారు శ్రీ వెంకాయమ్మగారు!

పూజ్యశ్రీ అమ్మగారి తాతగారు శ్రీ మన్నవ బుచ్చిరాయశర్మగారు. ఆయన ఎంతో సమయస్ఫూర్తి కలవారు. మేధావి. కానీ ఆయన ఎక్కువకాలం జీవించలేదు. ఆయన సోదరులలో ఒకరైన శ్రీమన్నవ హనుమంతయ్యగారు మహాయోగి. ఆయనకు ఆంజనేయ స్వామి నిత్య సాక్షాత్కారం ఉండేది. అంతటి గొప్ప భక్తులాయన!

పూజ్యశ్రీ అమ్మగారి తల్లిగారైన శ్రీమతి మన్నవ రంగనాయకమ్మగారు చిన్నతనంనుంచి శ్రీ కోదండ రామస్వామిని ఆరాధిస్తూ వుండేవారు. ఆమె అత్యంత సాత్వికురాలు. మహా ఇల్లాలు. చక్కటి గాయకి. నిరంతర భగవచ్చింతన ఆమె సొత్తు. ఆమె అందరితోను ఎంతో ప్రేమగాను, ఆదరణతోను వుండేవారు. ఆమె ఉదయం లేచినప్పటినుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నెన్నో ఆధ్యాత్మిక కీర్తనలు, శ్లోకాలు, పద్యాలు పాడుకుంటూనే వుండేవారు. ఆమెకు సహాయం చేస్తూ పిల్లలు కూడా వాటినన్నింటిని నేర్చుకున్నారు. పూజ్యశ్రీ అమ్మగారు కూడా చాలా బాగా పాడుతారు. ఆమె కూడా ఎన్నెన్నో పాటలు పాడేవారు. "మా అమ్మ గొంతు మాకు ఎవరికీ రాలేదు. ఆమె అస్సలు సంగీతం నేర్చుకోలేదు. అయినా ఎంతటి రాగాన్నైనా అలవోకగా పాడేయగలదు!" అని పూజ్యశ్రీ అమ్మగారు చెప్పేవారు. ఆమె ఇల్లంతా చక్కగా అలికి ముగ్గులు పెట్టేవారు. కుట్లు, అల్లికలు, వంట... ఒకటేమిటి? ప్రతి పనీ ఎంతో నైపుణ్యంతో, వేగంగా చేసేవారు. పిల్లలందరికీ తామే స్వయంగా బట్టలు కుట్టేవారు. చరఖా మీద నూలు ఒడికి స్వాతంత్ర సమరయోధుల వస్త్రాలకు వినియోగించేవారు. ఆమెకు చాలా దేశభక్తి. అంతేకాదు, ఆమె గొప్ప దైవ భక్తురాలు కూడా! ప్రతిరోజూ సూర్యోపాసన చేసేవారు. ఏ రోజూ సూర్యుని చూడకుండా భోజనం చేసేవారు కాదు. మొదట ఆమె జిల్లెళ్లమూడి అమ్మ భక్తురాలై ఆమెను సేవించేవారు. ఆ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి పరిచయంతో బాబా మార్గంలోకి వచ్చి, బాబాను సేవించారు. ఆమె భక్తికి మెచ్చి శ్రీ సాయిబాబా, శ్రీ అక్కల్ కోట స్వామి, శ్రీ రమణ

మహర్షి ఆమెకు తమ ప్రత్యక్ష సాక్షాత్కారాన్ని ప్రసాదించారు.

మొట్టమొదటిసారి జిల్లేళ్లమూడిలో పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడగానే ఆయన గొప్ప మహాత్ములని, సామాన్యులుగారని శ్రీమతి రంగనాయకమ్మగారు గుర్తించి నమస్కరించారు. ఇంకా అప్పటికి పూజ్యశ్రీ మాస్టరుగారు లోకానికి వెల్లడి కాలేదు. అయినా ఆమె పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడగానే ఆయన ఆధ్యాత్మిక ఔన్నత్యానికి దాసోహం అయ్యారు. ఆయన బోధన వలన సాయి భక్తురాలై పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలో సాధన కొనసాగించారు. నిరంతరము పూజ, జపం, పారాయణ, సత్సంగాలతో జీవితాన్ని సార్థకం చేసుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి వివాహానంతరం పూజ్యశ్రీ అమ్మగారి ఆహ్వానం మేరకు మన ఇంట్లోనే ఎక్కువకాలం వుండిపోయి పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రత్యక్ష సానిధ్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆయన ప్రతిరోజూ ఇంట్లో సత్సంగం చేస్తున్నప్పుడు శ్రీమతి రంగనాయకమ్మగారు క్రమం తప్పక శ్రద్ధగా వినేవారు. ఏరోజైనా ఆమె సత్సంగానికి రావడం ఆలస్యమైతే పూజ్యశ్రీ మాస్టరుగారు ఆమె కోసం వేచి వుండి, ఆమె వచ్చిన తర్వాతనే సత్సంగం ప్రారంభించేవారు! ఆమె పూజ్యశ్రీ మాస్టరుగారిని తమ సొంత అల్లునిగా కాక, ఒక సద్గురువుగా భావించి నమస్కరించేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా ఆమెను ప్రత్యేకంగా అనుగ్రహించారు. ఆమెకు జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని తీర్చమని భగవంతుని కోరక, తమ కుటుంబమంతా ఆధ్యాత్మిక మార్గంలో ఉండాలని ప్రార్థించి, ప్రతిరోజూ ఒక్కొక్కరి పేరున జపం చేసి, ఆ పుణ్యాన్ని వారికి ధారపోసేవారు. ఆమె మరణించే ముందు బాబా స్వప్న దర్శనమిచ్చి అనుగ్రహించారు. అపస్మారక స్థితిలో కూడా బాబా స్మరణ చేస్తూనే ప్రాణం విడిచారామె! అంతటి భాగ్యజీవి పూజ్యశ్రీ అమ్మగారి మాతృదేవి అయిన శ్రీమతి రంగనాయకమ్మగారు!

శ్రీమతి రంగనాయకమ్మగారి తండ్రిగారైన శ్రీ పులిపాక శేషయ్యగారు గొప్ప రామభక్తులు. ఆయన నిరంతరం రామనామం చేస్తూ ఎన్నో రామనామ కీర్తనలు ఆలపిస్తూ వుండేవారు. ఆయన తన కుమార్తెకు రామభక్తితో పాటు నిజమైన వైరాగ్య భావనను పెంపొందించారు. మానవులకు భగవంతుని శరణు వేడటమే దిక్కని, కష్టాలు, కోరికల కోసం కాక భగవంతుని కృప కోసం ఆయనను ఆశ్రయించాలని నేర్పించారు.

పులిపాక శేషయ్యగారి మాతృమూర్తి అయిన శ్రీమతి పులిపాక శేషమ్మగారు మహాలక్ష్మి ఉపాసకురాలు. ఆమె మహాభక్తురాలై తన భక్తితో దేవిని మెప్పించి నిత్యసాక్షాత్కారాన్ని పొందారు. ఆమెకు సాక్షాత్తు లక్ష్మీదేవి దర్శనమిస్తున్నప్పటికీ ఆమె ధనాన్ని, భోగభాగ్యాలను కోరలేదు! భక్తి, జ్ఞాన,



వైరాగ్యాలను, ముక్తిని ప్రసాదించమని ప్రార్థించేవారు. ఆ దేవి అనుగ్రహంతో తీవ్ర తపోనిష్ఠతో ఆమె తరించారు. ఆమె భక్తికి మెచ్చి లక్ష్మీదేవి నిత్య సాక్షాత్కారాన్ని ప్రసాదించి ప్రతిరోజూ అరటి ఆకులలో పాయసం, పులిహోర, పొంగలి, భక్ష్యాలు ఆమెకు అనుగ్రహించేది! ఆ భక్తురాలు ఆ ప్రసాదాలను అందరికీ పంచేవారు. ఆమె మన్నవ గ్రామంలో గురుమూర్తియై ఎందరో భక్తులకు మంత్ర దీక్షలను, ఆధ్యాత్మిక బోధలను అనుగ్రహించేవారు.

ఎన్నో తరాల నుండి భక్తి, వైరాగ్య సంపదలు కల ఆ కుటుంబంలో పూజ్యశ్రీ అమ్మగారు జన్మించారు. మనకందరికీ పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి, ఆయన పూర్వీకుల గురించి తెలుసు. పూజ్యశ్రీ అమ్మగారి జన్మదినం సందర్భంగా ఆమె పూర్వీకుల గురించి, ఆమె ఎటువంటి వంశంలో జన్మించారో, అసలు ఎటువంటి వంశంలో మహాత్ములు జన్మిస్తారో తెలుసుకునే ప్రయత్నం ఇది.

పూజ్యశ్రీ అమ్మగారి పెద్దమ్మగారైన శ్రీమతి మన్నవ సత్యవతీదేవి 10 సంవత్సరాల వయసులో వున్నప్పుడు శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ప్రత్యక్ష దర్శనమనుగ్రహించారు. ఆ క్షణం నుంచి ఆమె జీవించి వున్నంతకాలం లక్ష్మీదేవికి మహాభక్తురాలై నిరంతర స్మరణలో నిలిచి ధన్యురాలయ్యారు. ఆమె నిద్రపోతున్నప్పుడు కూడా ఆమె పెదవులు దేవిని జపిస్తూనే వుండేవి. జాగ్రత్తగా వింటే శ్రీ మహాలక్ష్మి నామం స్పష్టంగా వినిపించేది.

శ్రీమతి సత్యవతీదేవి గారి భర్తగారైన శ్రీ మన్నవ రామచంద్రరావుగారు శ్రీ శిరిడీ సాయినాథుని భక్తులు. ఆయన ఆరోజుల్లోనే శ్రీ తమ అల్లుడుగారైన శ్రీ పట్టాభి రామారావుగారి దర్శకత్వంలో వచ్చిన 'శ్రీ సాయిబాబా' అనే చలనచిత్రంలో సాయిబాబాగా నటించారు. ఈ చిత్రం 1948లోనే తెలుగు నాట విడుదలైంది. పూజ్యశ్రీ అమ్మగారి మేనమామైన శ్రీ పులిపాక చంద్రశేఖరరావుగారు కూడా ఆ చిత్రంలో ఒక పాత్ర ధరించారు. ఆయన బాబాపై భక్తితో తమ కుమారునికి సాయి ప్రసాద్ అని పేరు పెట్టారు. అలా పూజ్యశ్రీ అమ్మగారి పూర్వీకులు కూడా బాబా భక్తులై బాబా ప్రచారానికి కృషి చేశారు.

పూజ్యశ్రీ అమ్మగారి తండ్రిగారైన శ్రీ మన్నవ బాలకృష్ణశర్మగారి తాతగారు జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధి చెందిన శ్రీ అనసూయా దేవి గారి తాతగారు అన్నదమ్ములు. శ్రీ బాలకృష్ణ శర్మగారు జిల్లెళ్ళమూడి అమ్మకు వరసకు అన్నయ్య అవుతారు. అంటే పూజ్యశ్రీ అమ్మగారికి జిల్లెళ్ళమూడి అమ్మ వరుసకు మేనత్త. అయితే పూజ్యశ్రీ అమ్మగారి పుట్టిల్లు, శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ పుట్టిల్లు, అలాగే పూజ్యశ్రీ అమ్మగారి పెద్దమ్మగారు అయిన శ్రీమతి సత్యవతిదేవిగారి ఇల్లు పక్కపక్కనే వుండేవి. అందుకే వరుసకు కొంచెం దూరమే అయినా కుటుంబాలకు సాన్నిహిత్యం ఎక్కువ. కాలాంతరంలో పూజ్యశ్రీ అమ్మగారి తండ్రిగారు, ఆయన కుటుంబమంతా జిల్లెళ్ళమూడి అమ్మ భక్తులయ్యారు. పూజ్యశ్రీ అమ్మగారు ఆరు సంవత్సరాలు అమ్మ సేవలో గడిపారు. ఆ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి పరిచయమయ్యాక పూజ్యశ్రీ అమ్మగారి తల్లిగారు, సోదరసోదరీమణులు పూజ్యశ్రీ మాస్టరుగారికి భక్తులై సాయిని సేవించారు.

అలా ఎన్నో తరాల నుండి భక్తి, వైరాగ్య సంపదలు కల ఆ కుటుంబంలో పూజ్యశ్రీ అమ్మగారు జన్మించారు. మనకందరికీ పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి, ఆయన పూర్వీకుల గురించి తెలుసు. పూజ్యశ్రీ అమ్మగారి జన్మదినం సందర్భంగా ఆమె పూర్వీకుల గురించి, ఆమె ఎటువంటి వంశంలో జన్మించారో, అసలు ఎటువంటి వంశంలో మహాత్ములు జన్మిస్తారో తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆమె జననంతో వారందరూ ఉత్తమ గతులను పొందివుంటారు. దీనిని బట్టి మనమందరమూ కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలో నడుస్తూ, మన పిల్లలను నడిపిస్తూ.. అలా తరతరాలు కృషి చేస్తే మన వంశాలలో కూడా మహాత్ములు జన్మించడానికి అర్హత కలుగుతుందన్నమాట! అలా చేయటం కంటే పూజ్యశ్రీ మాస్టరుగారికి, పూజ్యశ్రీ అమ్మగారికి సంతోషకరమైనది ఏముంటుంది?

జై సాయి మాస్టర్!

సంకుచిత మతద్వేషాల పరిధులు దాటించే సీమోల్లంఘనం!

(విజయదశమి ప్రత్యేక వ్యాసం)

~పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఆది 1916. నాడు విజయదశమి. పరాశక్తికి రాక్షసులపైన విజయం చేకూరిన రోజు. బహుశః మనదేశంలోని సాధకులు తమలో ప్రాకృతికంగా ఉత్పన్నమయ్యే ఆసురీ, రాక్షస సంస్కారాలపైన విజయం సాధించవలసిన నియత దినంగా పెట్టుకొని సాధన చేసేవారు గాబోలు. రాజులు దిగ్విజయానికై దైవాన్ని పూజించి, పూజించబడిన ఆయుధాలను ధరించి ఊరేగింపుగా పట్టణ సరిహద్దు లేక సీమ దాటి, తిరిగి వచ్చేవారు. దీనికి స్మృతిచిహ్నంగా 'సీ మో ల్ల ం ఘ నో త్స వ ము' నేటికీ మహారాష్ట్ర దేశంలో జరుపుకుంటారు. పామరులు సాటివారిపట్ల గల అసూయ, ద్వేషాది భావాల వలన ఏర్పడిన సంకుచితమైన మానసిక అవరోధాలను దాటి, వాటిని మరచి, ఒకరినొకరు శమీపత్రాలిచ్చుకోడం ద్వారా అలా చేయమని హెచ్చరించుకొని ఆలింగనం చేసుకొనేవారు. ఇదీ ఒక సీమోల్లంఘనమే; 'శమీ' పూజే!

విజయదశమి తెల్లవారింది. భక్తులందరికీ సాయి విషయమై ఆందోళన పెరిగింది. కాని పెదవి విప్పి మాట్లాడే అవకాశాన్ని ఆయనెవ్వరికీ యివ్వలేదు. ఆయన దృష్టిలో సమాధి ఒక ఊయలే; మరణమొక నిదురే! కళ్ళు తెరచి మెలకువగా నిద్రించగల సాయికి మరణమెక్కడిది? కనుక దుఃఖించేందుకు మాట్లాడేందుకూ ఏముంది?

నాడు శిరిడీ ప్రజలు, సాయి దర్శనార్థమొచ్చిన భక్తబృందమూ వేడుకతో గ్రామ పొలిమేర దాటి తిరిగి మసీదు జేరుకున్నారు. సాయంత్రం చీకట్లు అలుముకుంటున్నాయి. అందరి హృదయాలలో మసీదును సమీపించగానే సాయి ముస్లిమా లేక హిందువా అన్న ప్రశ్న యథాప్రకారం తలెత్తింది గాబోలు. సాయి శివమెత్తిన ఆగ్రహంతో, చింతనిప్పులవంటి కన్నులతో మసీదు మెట్ల వద్ద నిలచి కేకలు వేస్తున్నారు. తన వంటిమీద నున్న గుడ్డలన్నీ తీసి ధునిలో పారవేసి "మూర్ఖులారా! నేను ముస్లింనో, హిందువుడనో యిప్పుడు చూచి తేల్చుకోండి!!" అని అరుస్తున్నారు. భక్తులు భయంతో నిలబడిపోయారు. భాగోజీ అనే సేవకుడు మాత్రం ఆయనను సమీపించి, నడుముకు లంగోటా చుట్టి, "బాబా, ఈరోజు పవిత్ర సీమోల్లంఘనోత్సవం జరుగుతుంటే మీరు ఎందుకు ఆగ్రహించి భక్తులను భయపెడతారు?" అన్నాడు. సాయి శాంతించక, "అవును ఈ దినమే నా సీమోల్లంఘనం" అని కేకలేశారు. కారణం, తాను పరమాత్మ తత్వమని, పరమాత్మ ఏ మతస్థుడూ కాదని, అయితే

ఆయన అన్ని మతాలకు చెందిన వాడేనని, ఆయన ఎన్ని విధాలుగా తెలియజేసినా, వారీ విచికిత్స మానలేదు. తన మతం కబీరు అని, తన కులము భగవంతుడని (పర్వర్దిగర్) ఎంత చెప్పినా వారు వినరాయె! ఇంత గమనించాక కూడా కొందరు వారికి ముస్లిం సాంప్రదాయం ప్రకారం 'సున్తి' చేయబడినదని, కొందరు ఆయనకు సున్తి జరుగలేదనీ నిశ్చయించారు! ఇరుపక్షాలవారు కలసియైనా ఆయన చెప్పదలచిన సత్యాన్ని గ్రహించలేదు. బాహ్యంగా సీమ దాటారేమో గాని అంతరంగంలో వారు సీమలు దాటలేదు. సాయిని వారి హృదయాలలోని యీ సంకుచిత భావాలనే 'నూనె వర్తకులు, దుకాణదారులు' బాధిస్తూనే వున్నారు.

ఇంకొక సీమోల్లంఘనం జరుగవలసివున్నది. తర్వాత ఒక రాత్రి దీక్షిత్ వాడాలో భక్తులు బూటీ, శ్యామా నిదురిస్తుండగా యిద్దరికీ సాయి స్వప్న దర్శనమిచ్చి, "ఇక్కడ ఒక మందిరాన్ని, భవనాన్ని నిర్మించండి. నేనక్కడుండి భక్తుల కోరికలు నెరవేరుస్తాను!" అన్నారు. అదే ఆదేశంగా తీసుకుని బాబా అనుమతితో నిర్మాణం ప్రారంభమైనది. భవనంలో క్రింది భాగంలో మురళీధరుని ఆలయాన్ని బూటీ ఏర్పాటు చేయించి విగ్రహం తయారుచేయమని శిల్పుల నాదేశించాడు. ఇంకా దాటవలసిన సీమలాయనకు గూడ వున్నాయి. భగవద్గీతలో ఆ మురళీధరుడే సద్గురువునే మోక్షం కొరకాశ్రయించాలని చెప్పినా, బూటీ గుర్తించక తన పిచ్చిలో తనున్నాడు.

1918 సంవత్సరం ప్రారంభమైంది. ఉద్దవేశ్, చంద్రబాయి మొదలైన భక్తులతో సాయి ఒకసారి "ఇక నుంచి మీరు ఇంత శ్రమపడి ఇక్కడకు రానక్కరలేదు" అన్నారు.

ఒకరోజు కాశిమ్ అనే భక్తునితో సాయి,



"ఔరంగాబాద్ వెళ్లి షంషుద్దీన్ మియా అనే ఫకీరుకు నేను ఇచ్చే 250 రూపాయలు ఇచ్చి, "9వ నెలలో 9వ రోజున అల్లా పెట్టిన దీపం అల్లా తీసుకుపోతారు" అని చెప్పు. మౌలు, కవ్వాలి, నియాజ్ జరిపించమను. తర్వాత బన్నేమియా అను ఫకీరును దర్శించి ఆ మాటే చెప్పి అతడి మెడలో నేనిచ్చే మాల వెయ్యి!" అని ఆ పైకము, మాల యిచ్చారు.

కాశిమ్, చోటేఖాన్, అమీర్ అనే అతడి అనుచరులు ఔరంగాబాదు చేరేసరికి రైలుస్టేషన్‌కు ఒక ఫకీరు వచ్చి పెట్టెల దగ్గర "శిరిడీ సాయి ఫకీరు వద్ద నుండి వచ్చినవారెవరు?" అని అరుస్తున్నాడు. అతడే షంషుద్దీన్ అని తెలిసి నమస్కరించిన ఆగంతుకులతో ఆ ఫకీరు సాయి సందేశాన్ని తానే యథాతథంగా వల్లించేశాడు! ముగ్గురినీ యింటికి తీసుకువెళ్ళి ఆతిథ్యమిచ్చి, నాటి రాత్రి మౌలు, కవ్వాలి (సంకీర్తన, భజన) జరిపించి పేదల కన్నదానం (నియాజ్) జరిపించాడు షంషుద్దీన్.

మరుసటి ఉదయం వీరు వెళ్ళేసరికి బన్నేమియా ఫకీరు యోగసమాధిలో ఒక చేయి ఆకాశంవైపు చాపి, రెండవ చేయి క్రిందకు చాపి, కన్నార్పక నిలుచుని వున్నారు. ఆ స్థితిలో వారిని పలకరిస్తే ఆగ్రహించి దండిస్తారని అచ్చట వున్న అరబ్బులు ఆగంతుకులతో చెప్పారు. కొంతసేపు వేచిచూచి, చోటేఖాన్ శ్రీసాయిని

స్మరించి, బన్నేమియా మెడలో సాయి పంపిన మాల వేశాడు. మరుక్షణమే ఆ మహనీయుడు యోగ సమాధి నుండి మేల్కొని సాయి పంపిన కబురు విని, ఆకాశంకేసి చూచి కన్నీరు కార్చారు. తన గురువాజ్ఞను పాటించి 'ఎంతటి మహనీయుడైనా మానవాకారంలో వున్న వారికి మాల వేయరాదు' అనే సీమనుల్లంఘించారు చోటేఖాన్, కాశిమ్‌లు. అందుకే వారికంతటి భాగ్యాన్ని ప్రసాదించారు సాయి.

అక్టోబరు మాసమారంభమైనది. బాబా భిక్షకు వెళ్ళారు. మాధవ్‌ఫస్లే అను సేవకుడు మశీదు చిమ్ముతున్నాడు. సాయికి ప్రాణసమానమైన యిటుక నేల మీద వున్నది. అది తమ గురు ప్రసాదమని చెప్పి సాయి ఎప్పుడూ దానిపైన చేయి వుంచి కూర్చోడము, తలక్రింద వుంచుకుని పడుకోడమూ చేసేవారు. దానిమీద దుమ్ము పడకుండా ఫస్లే దానిని తీయబోయాడు. చేయి జారి క్రిందపడి అది విరిగింది. సాయి తనపై ఆగ్రహిస్తారని భయపడ్డాడు ఫస్లే. తర్వాత దానిని చూచి సాయి ఎంతో బాధగా, "విరిగినది యిటుక కాదు. అది నా ప్రాణం; నా ప్రారబ్ధమే విరిగింది. నేనిక ఎక్కువ కాలం జీవించను" అన్నారు. దానిని బంగారంతో అతికించి యిస్తానన్నాడు బూటీ. బాబా నవ్వి, "అదలా అతికేది కాదు" అన్నారు.

అక్టోబరు 3వ తేదీ పురందరే, దీక్షిత్‌లతో బాబా, "నేను మొదట వెడతాను. మీరు వెనుక వస్తారు" అన్నారు. తిరిగి వారికి ఊదీ యిచ్చి సాగనంపుతూ, "నా సమాధి మాట్లాడుతుంది. నా మట్టి సమాధానం చెబుతుంది!" అన్నారు. స్వస్థులైన బాబా అలా ఎందుకు పలికారో వారికర్థంగాలేదు.

విజయదశమి సమీపించింది. సాయికి జ్వరమొచ్చింది. ఆయన భిక్షకు, లిండీకీ వెళ్ళడం మానేశారు.

విజయదశమి వారం రోజులున్నది. ఆ రోజే ప్రారంభించి, వాఘే అనుభక్తుని చేత "రామవిజయం" అనే సద్గ్రంథాన్ని ఒకవారంలో మూడుసార్లు చదివించుకొని విన్నారు సాయి. ఆ తర్వాత తమ సమయమంతా మౌనంగా గడపసాగారు బాబా. ఔరంగాబాదు ఫకీర్లకు ఆయన పంపిన వర్తమానాన్ని గూర్చి విని బాబా ముస్లిమని నిర్ణయించడానికి వీలులేకుండా సాయి ముందే జాగ్రత్తపడ్డారు.

విజయదశమి తెల్లవారింది. భక్తులందరికీ సాయి విషయమై ఆందోళన పెరిగింది. కాని పెదవి విప్పి మాట్లాడే అవకాశాన్ని ఆయనెవ్వరికీ యివ్వలేదు. ఆయన దృష్టిలో సమాధి ఒక ఊయలే; మరణమొక నిదురే! కళ్ళు తెరచి మెలకువగా నిద్రించగల సాయికి మరణమెక్కడిది? కనుక దుఃఖించేందుకు మాట్లాడేందుకూ ఏముంది? శ్రీసాయి లక్ష్మిబాయి షిండే అను భక్తురాలిని పిలిచి ఆమెకు మొదట రూ.4/-లు తర్వాత 5/-లు యిచ్చి భద్రపరచుకోమని చెప్పారు.

మధ్యాహ్న హారతి యథావిధిగా జరిగింది. అప్పుడే దశమి ఘడియలు గడచి ఏకాదశి ప్రవేశించింది. భక్తులందర్నీ భోజనాలు చేసి రమ్మని పంపారు బాబా. శ్రీమతి లక్ష్మీబాయి షిండే, భాగోజీ, బయ్యాజి అప్పాకోతే పాటిల్, బాలాషింపే, నిమోన్కర్‌లు మాత్రం బాబా చెంతనుండిపోయారు.

సాయి షింపేతో "అబ్దుల్లాను రమ్మను!" అన్నారు. అతడు పరిగెత్తాడు. కొద్ది నిమిషాలు సాయి అబ్దుల్లా కోసం గాబోలు మశీదు గేటుకేసి చూస్తూండిపోయారు. మరుక్షణమే సాయి అక్కడి వారితో, "నాకీ మశీదులో వుంటే ఏమీ బాగాలేదు. నన్ను ఆ రాతిమేడ (బూటీ వాడా)లోకి తీసుకుపోండి. బాగుంటుంది," అంటూనే బయ్యాజీ అప్పాకోతే పాటిల్ వైపుకు వొరిగి కన్నుమూసారు. భాగోజీకి అనుమానం వచ్చి నిమోన్కర్‌తో చెప్పాడు. అతడు బాబా నోటిలో నీరుపోసి, అవి బయటకు వచ్చేయడంతో నిమోన్కర్ సాయి తనువు చాలించారని గుర్తించి పెద్దగా ఏడ్వనారంభించాడు. అందరూ గొల్లుమన్నారు. క్షణంలో శిరిడీ గ్రామమంతా అసువులు వీడిన శవంలా అయింది. గ్రామస్థులు, భక్తులు హృదయవిదారకంగా శోకిస్తూ మశీదు చేరారు. కొందరు స్పృహతప్పి పడిపోయారు; కొందరు రోదించారు; కొందరు దుఃఖము, కన్నీరు పెగలక బిగుసుకుపోయారు.

ఏది ఏమైనా బాబా సీమోల్లంఘనం చేశారు. సాకారంగా ఆయన ఉన్నంత వరకూ భక్తులు ఆయన హిందువా? లేక ముస్లిమా? అన్న సీమ దాటేటట్లు లేరు. పరస్పర అసూయాద్వేషాలను మానేలాలేరు. అట్టి దుస్థితి నుండి మనల నుద్ధరించడానికే సాయి తమ దేహసీమ దాటారు. అలాంటి విజయదశమినాడైనా మన హృదయాలు సీమోల్లంఘనం చేయగల్గితేగాని అరవై సం॥లు సాయి నిర్వర్తించిన నిరతాగ్నిహోత్రం లాంటి లీలాఘట్టానికి అర్థములు గాలేము. "తల్లికి తగిన బిడ్డలు కండి. మీ ధనాగారాలు నింపుకోండి. లేకుంటే మనమేమవుతాము? మట్టి మట్టిలో, గాలి గాలిలో కలిసిపోతాయి. ఇలాంటి అవకాశం మరలా రాదు" అంటూంది విజయదశమి!!! ●

మాతృదేవి స్మృతులు

~శ్రీమతి ఇందిరారావు

నాగోలు సత్సంగ సభ్యులు శ్రీమతి ఇందిరారావుగారు పూజ్యశ్రీ అమ్మగారి లీలావైభవాన్ని ఈవిధంగా తెలియచేస్తున్నారు--

1979 ఫిబ్రవరి నెలలో పూజ్యశ్రీ మాస్టరుగారు మొదటిసారి ఢిల్లీ వచ్చారు. అప్పుడు మావారు ఢిల్లీ ఐ.ఐ.టి.లో అసిస్టెంట్ ప్రొఫసరుగా ఉద్యోగం చేసేవారు. నేను మహర్షి మహేష్ యోగిగారి ధ్యానవిద్యాపీఠంలో పనిచేదానిని. అక్కడ నాతోపాటు పనిచేస్తున్న శ్రీమతి ఉమా అయ్యర్ ఇంట్లో పూజ్యశ్రీ మాస్టరుగారు విడిది చేశారు. అప్పుడు మమ్మల్ని కూడా సత్సంగానికి రమ్మంటే వెళ్ళాము. అదే మొదటిసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడటం. 'దైవం మానుషరూపేణ' అన్నట్లు అతిసామాన్యమైన రూపంలో భగవంతుడే గురువుగా మా జీవితాల్లోకి ప్రవేశించారు.

తిరిగి అదే సంవత్సరం సెప్టెంబరులో పూజ్యశ్రీ అమ్మగారు, మూడేళ్ళ వేదవతితో కలిసి పూజ్యశ్రీ మాస్టరుగారు మరలా ఢిల్లీ వచ్చారు. అప్పుడు ఒకరోజు మా ఇంట్లో సత్సంగం, వారికి ఆతిథ్యము జరుపుకునే అవకాశాన్ని ప్రసాదించారు. అదే మొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకోవడం.

1980వ సంవత్సరంలో పూజ్యశ్రీ మాస్టరుగారు సకుటుంబంగాను, కొంతమంది సత్సంగ సభ్యులతోనూ శిరిడీకి వెళ్తూ, ఢిల్లీనుంచి మమ్మల్ని కూడా రమ్మనమని కబురుచేసారు. ఇటునించి నేను, మావారు, పెద్దమ్మాయి అరుంధతి (8సం॥లు), చిన్నమ్మాయి అనురాధ (4సం॥లు) శిరిడీకి వెళ్ళాము. పిల్లలందరూ చిన్నవాళ్లవడం వల్ల వాళ్ళని ఆడిస్తూ గడపటంలో పూజ్యశ్రీ అమ్మగారితో గడపటానికి, మాట్లాడటానికి ఎక్కువ అవకాశం కలిగింది.

1983లో మాకు అబ్బాయి పుట్టాడు. 1984 వేసవికాలంలో ప్రథమంగా మా కుటుంబం అంతా ఒంగోలులోని పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్ళాము. వెళ్ళగానే వారి ప్రేమపూరితమైన ఆహ్వానం మాకెంతో ఆనందాన్ని కలిగించింది. మళ్ళీ రెండవసారి 1988లో వెళ్ళాము. ఎప్పుడూ ముందు సత్సంగహాలులో దర్శనమిచ్చే పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడ లేరు! కొంచెం తటపటాయిస్తూ పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకి వెళ్ళాము. పూజ్యశ్రీ అమ్మగారు ఆప్యాయంగా, "రండి, రండి!" అని ఆహ్వానిస్తూ, "ఇప్పుడే మాస్టరుగారు లోపలికెళ్లారు" అన్నారు. ఇంతలోనే పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చారు. ఈ విషయం ఎందుకు చెప్పానంటే, మళ్ళీసారి మేము పూజ్యశ్రీ మాస్టరుగారి మండలారాధనకే రావడం జరిగింది. అప్పుడు అనిపించింది, క్రిందటిసారి మేము నేరుగా పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకునే పరిస్థితి పూజ్యశ్రీ మాస్టరుగారు ఎందుకు కల్పించారో! అప్పుడే చెప్పకనేచెప్పారన్న మాట, ఇక అన్నీ మీకు పూజ్యశ్రీ అమ్మగారే అని!

మేము ప్రతిసంవత్సరం వేసవి సెలవులలో ఒంగోలు వెళ్ళేవాళ్ళం. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు మా పిల్లలకు మన తెలుగుభాషను గురించి, సంస్కృతిని గురించి చాలా విషయాలు చెప్పేవారు. వీళ్ళు అర్థంకాక మళ్ళీ మళ్ళీ అడిగినా ఎంతో ఓర్పుతో చెప్పేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు సశరీరులై వున్నప్పటినించి

మేము ఎప్పుడు ఒంగోలు వెళ్లినా సముద్రస్నానానికి వెళ్లడం అలవాటు. అదే విధంగా పూజ్యశ్రీ అమ్మగారు కూడా మమ్మల్ని పంపించేవారు. మాకోసం తెల్లవారుఝామునే లేచి ఇడ్లీలు, పులిహోర, దద్దోజనం.. అన్నీ తయారుచేసి వుంచేవారు. ఎవ్వరూ తన దగ్గర వుండక్కరలేదని చెప్పి, ఒక్క పనిపిల్లను మాత్రం తన దగ్గర వుంచుకుని అందరినీ ఎంతో సంతోషంగా పంపించేవారు.

పూజ్యశ్రీ అమ్మగారిలో నేను బాగా గమనించగలిగింది వారి సున్నితత్వం. ఒక విషయం చెప్పేటప్పుడు కానీ, చేయించేటప్పుడు కానీ, ఎదుటివారి మనసు నొచ్చుకోకుండా చెబుతారు. ఒకవేళ వారు చెప్పేది నేను అర్థం చేసుకోలేక తొందరలో, 'నాకు తోచిందే బాగుంది కదా!' అన్న భావం వ్యక్తపరిస్తే, "సరే అలాగే!" అనేవారుకాని, "నేను చెప్పిందే చెయ్యి!" అనేవారు కాదు. తర్వాత ఎప్పటికో నాకే అది తప్పని తెలిసి క్షమించమని అడిగితే, "అందుకేగా నేనలా చెప్పింది" అంటారే తప్ప, ఇంకేమీ అనరు!

పూజ్యశ్రీ అమ్మగారిలో నేను గమనించిన ఇంకో విశేషం – పతిసేవా దీక్ష! ఉత్తమోత్తమమైన గృహిణిగా పూజ్యశ్రీ మాస్టరుగారిని సేవించుకోవడంలో పూజ్యశ్రీ అమ్మగారికి వున్న శ్రద్ధ, భక్తి, నేనెక్కడా చూడలేదు. అప్పుడే కాదు, తమ మహాసమాధి పర్యంతము కూడా పూజ్యశ్రీ అమ్మగారు అదేవిధంగా ఏ సమయానికి పూజ్యశ్రీ మాస్టరుగారికి చేయవలసిన సేవలు ఆ సమయానికి చేసేవారు. మానవమాత్రులెవరూ అలా చేయలేరనిపిస్తుంది. అలాగే అతిథి



సత్కారం! ఎవరెవరికి ఏమేమి అవసరాలో, అలవాట్లో, ఇష్టాయిష్టాలో అన్ని అడిగి తెలుసుకుని వారికి కావలసినవి సమకూర్చడంలో ఎంతో ఓర్పు, ఆదరణ కనిపిస్తాయి.

పూజ్యశ్రీ అమ్మగారు మాకు ప్రసాదించిన కొన్ని లీలలను ఇప్పుడు మీతో నేను పంచుకుంటాను.

మా చిన్నమ్మాయి అనురాధ పెళ్ళికి మేము ఢిల్లీనుంచి హైదరాబాదుకి బయలుదేరుతున్నాము. మూడు టాక్సీలలో కుటుంబసభ్యులు, సామాను అంతా సర్దుకున్నాము. పదికిలోమీటర్ల దూరంలో వున్న రైల్వేస్టేషనుకి బయలుదేరాము. మార్గమధ్యంలో హఠాత్తుగా మా టాక్సీ ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా కదలలేదు. ఇంక సమయం ఎక్కువ లేకపోవడంతో రెండు టాక్సీలలో కొంతమంది, కొంతసామానూ సర్దుకుని ముందు స్టేషనుకి చేరుకున్నాము. మిగిలినవాళ్ళు వేరే టాక్సీ మాట్లాడుకుని రావాలి. పైగా అక్కడ వేరే టాక్సీ దొరికే అవకాశం కూడా లేదు. మేము స్టేషన్ చేరుకున్నాక రైలు బయలుదేరడానికి చాలా తక్కువ సమయం వుందని తెలిశాక నాకు చాలా ఆందోళన కలిగింది. వెంటనే పూజ్యశ్రీ అమ్మగారికి ఫోన్ చేసి విషయం చెప్పాను. "అలాగా! వచ్చేస్తారేమోలే" అన్నారు. నిజానికి అక్కడ వున్న సమయానికి వెంటనే టాక్సీ దొరికినా రాలేరు. కానీ అమ్మగారు ఆ మాట చెప్పాక కాస్త ఊపిరి పీల్చుకున్నాను. సరిగ్గా పూజ్యశ్రీ అమ్మగారికి ఫోను చేసిన కాసేపటికి మావాళ్ళు వచ్చేశారు. సామాను లోపల పెట్టి ఎక్కగానే రైలు బయలుదేరింది. అప్పటి పరిస్థితి వర్ణనాతీతం. ఎందుకంటే ఆ రైలు దాటిపోతే పెళ్ళి సమయానికి చేరుకోలేని పరిస్థితి. పూజ్యశ్రీ అమ్మగారు కాల స్వరూపిణియై, కాలగతి మార్చకపోతే మేము చేరుకోవడం అసంభవం. అందుకే "ఓం కాలస్వరూపాయైనమః" అని స్మరించుకుంటూ అంజలి ఘటించాను.

కాలగతిలో ఆడపిల్లల పెళ్లిళ్లు, మా అబ్బాయి చదువు అన్నీ పూర్తయ్యి, మా శేషజీవితం పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో గడపాలని నాగోలు చేరుకున్నాము. మా పిల్లలకు చిన్నతనంనుంచి పూజ్యశ్రీ అమ్మగారితో ఎక్కువ అనుబంధం వుండటంవల్ల



వారు కూడా వారి కుటుంబాలతో ఈ సన్నిధికి చేరుకున్నారు. మేము నాగోలు వచ్చిన కొత్తలో నమ్మకస్తుడనుకుని ఒక డ్రైవర్ ని పెట్టుకున్నాము. తరవాత అతని గురించి వేరే విషయాలు తెలియడంతో మానిపించేసాము. కానీ ఒకరోజు వంటచేస్తూ వుంటే అతని గురించిన ఆలోచనలు రాసాగాయి. ఇదివరకు మాదగ్గర పనిచేసినప్పుడు 'మీరు ముగ్గురే కదా, మీకు ఇంత ఇల్లు ఎందుకు?' లాంటి ప్రశ్నలు వేసేవాడు. అవన్నీ గుర్తొచ్చి, అతని వల్ల ఏమైనా అపాయం వుంటుందా అని నాకు లోపల ఏదో భయం వెయ్యడం మొదలయ్యింది. ఈ లోపల ఫోన్ మోగింది. తీస్తే అటువైపు పూజ్యశ్రీ అమ్మగారు, "ఏం ఆలోచిస్తున్నావ్?" అనడిగారు. విషయం చెప్పాను. కొంచెం విసుగ్గా "ఆ! అలాంటివి అస్సలు ఆలోచించకూడదు" అన్నారు. వెంటనే నా మనస్సు మామూలుగా అయిపోయింది. మన లోపలా బయటా కూడా భగవంతుడే వుండి నడిపిస్తాడు, అన్నట్లు పూజ్యశ్రీ అమ్మగారు నాలోపల వచ్చే భావాలకు పరోక్షంగా కాకుండా, ప్రత్యక్షంగా పరిష్కరించడం ఆశ్చర్యం, నా అదృష్టం! "సర్వాంతర్బహిస్థితాయై నమః!" అని నిరూపించిన లీల ఇది!! ఇదే విధంగా మా అబ్బాయిని చాలా క్లిష్ట పరిస్థితులనుంచి కాపాడారు. మా కుటుంబం మొత్తం వారి కరుణాకటాక్షములతోనే సురక్షితంగా వున్నాము.

ఇక్కడ ఇంకొక ముఖ్యమైన లీల చెప్పాలి. 2007వ సంవత్సరంలో ఒకరోజు ఉదయాన్నే అలవాటుగా ధ్యానంలో కూర్చున్నాను. కొంతసేపు అయ్యాక పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక సింహాసనం మీద కూర్చుని కనిపిస్తున్నారు. పూజ్యశ్రీ అమ్మగారు తన చీర కుచ్చిళ్ళనించి కిందకి చూస్తూ "నీకోసమే, నీకోసమే చేయిస్తున్నాను!" అన్నారు. నాకేమీ అర్థం కాలేదు. ఇంతలో ఎవరో సేవకులు పూజ్యశ్రీ అమ్మగారికి పాదుకలు అందించారు. పూజ్యశ్రీ అమ్మగారు వాటిని ఒడిలో వుంచుకున్నారు. అవి ఎంత బాగున్నాయంటే, మైసూరు ఎర్రచందనంతో చేసి, బాగా పాలిష్ చేసినట్లు నున్నగా మెరుస్తున్నాయి. వాటిమీద దంతంతో చేసిన సన్నటి చార వుంది. వాటిని చూడగానే "అమ్మగారూ, ఈ దత్తపాదుకలు మాస్టరుగారివా?" అని ఆశ్చర్యంగా అడుగుతున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు ఏమీ చెప్పలేదు కానీ, పూజ్యశ్రీ మాస్టరుగారు అదృశ్యమైపోయారు. ఇంతలో ఎక్కడినించో వచ్చిన గాలి వీస్తోంది. పూజ్యశ్రీ అమ్మగారు కూర్చున్నప్పుడు వారి పాదాలు ఎప్పుడూ మనకు కనబడవు. కానీ ఆ రోజు ఆ గాలికి చీర కుచ్చిళ్ళు కొద్దిగా పక్కకి తొలగి, వారి పాదాలు స్పష్టంగా దర్శనమిచ్చాయి. అంతేకాకుండా నాకు సమాధానం కూడా లభించింది. ఆ దత్తస్వామియే పూజ్యశ్రీ మాస్టరుగారిగాను, పూజ్యశ్రీ అమ్మగారిగానూ ఆ సింహాసనాన్ని అధిరోహించారని!! 'శ్రీ దత్తాయ గురవే నమః' అని నమస్కారం చేసుకున్నాను!!

పూజ్యశ్రీ అమ్మగారికి శతసహస్రకోటి కృతజ్ఞతా కుసుమాంజలులు సమర్పిస్తున్నాను.

గురుపత్ని మాతృశ్రీ అలివేలు మంగమ్మ

~శ్రీమతి శ్రీదేవి

శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్ని మన మాతృదేవి శ్రీ అలివేలు మంగమ్మగారితో పరిచయం కలిగిన వాళ్ళు, ఆమె సన్నిధి భాగ్యాన్ని అనుభవించిన వాళ్ళు, ఆమె జీవితగమనం గురించి అవగాహనను వాళ్ళ శక్తి మేరకు తప్పనిసరిగా కలిగి వుంటారన్నది నిశ్చయం. ఎందుకంటే ఆమె జీవితం ఆద్యంతం తెరచిన పుస్తకమే!

అయితే, నేను యీ శీర్షిక పేరు 'గురుపత్ని మాతృశ్రీ అలివేలు మంగమ్మ' అని పెట్టటానికి కారణం ఆమె తన గురించి తాను సద్గురు భరద్వాజ దేవుల సహధర్మచారిణిగానే వ్యవహరించారు తప్ప, తన అస్తిత్వం గురించి తన మాటలలో గాని, చేతలలో గాని వేరొక విధంగా వ్యక్తపరచుకొన్న దాఖలాలు లేవు. ఆమె భక్తులకు చేసిన బోధలు, ప్రసంగాలు అన్నీ పరిశీలిస్తే ప్రతి విషయంలో "పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పేవారు", "పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా వ్యవహరించేవారు" అన్న పదాలే వినిపిస్తాయి. శ్రీ మాస్టరుగారు నిరంతరం శ్రీ సాయినాథుని గురించి ఆయన దివ్యానుగ్రహము, దివ్యశక్తి గురించి ఏవిధంగా భక్తులకు చెప్పేవారో అదే విధంగా శ్రీ అమ్మగారు కూడా శ్రీమాస్టరుగారి, శ్రీ సాయినాథుని బోధలు, వారి కరుణ, వారి లీలలు గురించి అందరికీ వివరించి చెపుతుండేవారు.

తనకంటూ ఎటువంటి సుఖము, విశ్రాంతి ఆశించక అనుక్షణము శ్రీమాస్టరుగారికే తనను తాను సర్వసమర్పణ చేసుకుని తరించిన మహనీయురాలు మన మాతృదేవి శ్రీ అలివేలు మంగమ్మ గారు.

శ్రీమాస్టరుగారిని ఛాయవలె అనుసరించిన అర్ధాంగి, సహధర్మచారిణి, గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి విశిష్ట సద్గుణాలను గురించి ఆమె జన్మదిన పవిత్ర సమయాన స్మరించుకొని తరిద్దాం!

శ్రీ మాస్టరుగారి వలెనే శ్రీ అమ్మగారు కూడా సద్గురువై మనకు తెలియని ఎన్నో విషయాలపై తన బోధల ద్వారా మనకు అవగాహన కల్పించటానికి ఎన్నో అనుగ్రహభాషణలు చేశారు. ఇటువంటి వారి దివ్యబోధలు అసంఖ్యాకములు. వాటిని అన్నిటినీ వివరించటానికి జీవిత కాలం చాలదు. కనుక ఆ దివ్య సందేశాలలో రెండే రెండు అంశాలు: 'కృతజ్ఞత, 'కర్తవ్యనిష్ఠ" అనే విషయాల గురించి అమ్మగారి వివరణను తెలుసుకొందాం.

మొట్టమొదటగా మనం కృతజ్ఞత చూపవలసినది మనం ఇహపర శ్రేయస్సును పొందేందుకు మనకు దారిచూపిన సద్గురువు పైననే అని అమ్మగారు చెప్పేవారు.

తనకు బ్రహ్మానుభూతి నందించిన సాయినాథుని పట్ల కృతజ్ఞతగా క్షణక్షణం ఆయననే స్మరిస్తూ ఆయన మహిమను తన తుదిశ్వాస వరకు ప్రపంచానికి చాటి చెప్పారు శ్రీ మాస్టరుగారు.

మహాత్ములయినా, సాధారణ వ్యక్తులయినా వారి నుండి మనం పొందిన సహాయానికి కృతజ్ఞులమై వుండాలంటారు శ్రీ

అమ్మగారు.

ఈ సందర్భంగా ఎక్కడో చదివిన ఒక కథ గుర్తుకు వస్తోంది. అదేంటంటే:

ఒకసారి సద్గుణాలన్నీ మానవాకారాలు దాల్చి ఒక సభ నిర్వహిస్తాయి. ఆ సభలో దయ, ప్రేమ, సహనము, శాంతము, దాతృత్వము – యిలా సద్గుణాలన్నీ కొలువుదీరి "తమ తమ ఆసనాలలో కూర్చుంటాయి. ఇంతలో ఆ సభలోకి ఎంతో మురికిగా చినిగిన పాతవస్త్రాలు ధరించి, బలహీనంగా, దీనంగా వున్న ఒక స్త్రీ తడబడుతూ, భయం భయంగా అక్కడకు ప్రవేశించి తలవంచుకుని ఒక మూలగా నిలబడుతుంది. నీవెవరు? అని అడిగిన అక్కడి వారితో "బాబూ! నా పేరు వినయము. నేను కూడా సద్గుణాలలో ఒకరిని కదా! అయినా నన్నెవ్వరూ ఆదరించరు. నేను ఎవరికీ అక్కర్లేదు. ఎవరూ నన్ను తమ వద్దకు రానివ్వరు. అందుకే యిక్కడకు కూడా రావచ్చో, రాకూడదో అని సందేహిస్తూ వచ్చాను" అన్నది.

మరొక చెప్పుకోదగిన విషయం ఏమిటంటే అమ్మగారు మనకు ఏది బోధించినా తాను మొదటగా ఆచరించిన విషయాలనే మనకు చెప్పేవారు గానీ కేవలం దంతవేదాంతం ఏనాడూ బోధించి ఎరుగరు.

మానవులలో అహంకారము, గర్వము, మదము అనే దుర్గుణాలు ప్రబలి, పెద్దల పట్ల, మనకు మేలు చేసే సజ్జనుల పట్ల వినయం అనే గుణం పూర్తిగా కరువైపోయిందని ఈ కథలోని భావం.

కృతజ్ఞత కూడా యీ కోవలోకే వస్తుందనిపిస్తుంది. చేసిన మేలు మరచేవాళ్లే ఎక్కువ. అందుకే, "కుక్కకు వున్న విశ్వాసం మనిషికి వుండదు" అంటారు.

కృతజ్ఞతకు ఆలంబనం ప్రేమ. మనకు మేలు చేసిన వారి పట్ల మనకు కలిగిన ప్రేమవలన తిరిగి వారికి ఏదో ఒక మేలు చెయ్యాలనుకొవటమే కదా, కృతజ్ఞత అంటే! కానీ చూడండి, కని పెంచిన తల్లి నుండి సమాజంలోని ఎందరి పైననో మనం ఆధారపడి జీవిస్తున్నాం. కానీ మనం మన సౌఖ్యం గురించి, మన కుటుంబ సౌఖ్యం గురించి మాత్రమే ఆలోచిస్తాము గానీ మన చుట్టూ వున్న సాటివారి గురించి పట్టించుకోము.

మన పాలి దైవమై వెలసి మనకు సన్మార్గాన్ని చూపిన శ్రీ మాస్టరుగారిని ప్రత్యేక పూజలతో సేవించుకొని వారి పట్ల మన కృతజ్ఞతను వ్యక్తపరుస్తూ ఆ రోజంతటినీ వైభవోపేతంగా, పండుగగా జరుపుకొనటమే కృతజ్ఞతా మహోత్సవం. అంతేకాదు, ఆ రోజు మాత్రమే పూజలు, భజనలు, పారాయణలు చేయటం కాక, శ్రీ మాస్టరుగారి బోధలను నిరంతరం మననం చేసుకుంటూ ఆ మహానీయుడు మన కందించిన దివ్యోపదేశాలను స్మరించి ఆచరణలో పెట్టుకొనటానికి ప్రయత్నించాలని మనలను మనం దృఢంగా అప్రమత్తులను చేసుకొనటం కూడా కృతజ్ఞతా మహోత్సవ ప్రధానోద్దేశం..!

కృతజ్ఞత వంటి సద్గుణాలు సమాజంలో లోపించబట్టే అమ్మగారు ప్రత్యేకించి కృతజ్ఞత గురించి హెచ్చరించారు. మరొక చెప్పుకోదగిన విషయం ఏమిటంటే అమ్మగారు మనకు ఏది బోధించినా తాను మొదటగా ఆచరించిన విషయాలనే మనకు చెప్పేవారు గానీ కేవలం దంతవేదాంతం ఏనాడూ బోధించి ఎరుగరు.

శరీర మింద్రియం ప్రాణమర్థ స్వజన బాంధవాన్।
ఆత్మదారాదికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్ ॥

అన్న శ్లోకం అమ్మగారికి వర్తిస్తుంది.

'తన దనుకొన్న సర్వాన్నీ సద్గురువుకు సమర్పణ చేయాలి' అని యీ శ్లోకానికి అర్థం. జిల్లెళ్ళమూడి జీవితం నుండీ, శ్రీమాస్టరుగారి ధర్మపత్నియై, యిద్దరు బిడ్డలకు జన్మనిచ్చిన తల్లియై, అసంఖ్యాక భక్తులకు మాతృదేవియై నిలచిన ఆమె ఏనాడూ విశ్రాంతి ఎరుగరు. జీవితంలోని ప్రతిక్షణము అప్రమత్తతతో తన గురువైన శ్రీమాస్టరుగారి అడుగుజాడలలో నడిచారు. నిరంతరం ఆయననే స్మరించేవారు. తుదిశ్వాస వరకు ఆయన సేవలే చేశారు. మంచంలోనుండి కదలలేని స్థితిలో కూడా మాస్టరుగారికి, సాయిబాబాకు చేసే నిత్య నివేదన, సేవలు – కాఫీ, ఫలహారాలు, భోజన సమర్పణలన్నీ తానే స్వయంగా నిర్వర్తించారు. ఇలా తనకంటూ ఎటువంటి సుఖము, విశ్రాంతి ఆశించక అనుక్షణము శ్రీమాస్టరుగారికే తనను తాను సర్వసమర్పణ చేసుకుని తరించిన మహనీయురాలు మన మాతృదేవి శ్రీ అలివేలు మంగమ్మ



గారు.

ఇదే ఆమెకు మాస్టరుగారి పట్లగల అంతులేని కృతజ్ఞతకు పరాకాష్ట. ఇలా ఆమె తన ఆచరణే ఉపదేశంగా చూపించి, కృతజ్ఞత అన్న విశిష్ట గుణాన్ని ఒక మహోత్సవంగా విస్తరింపజేశారు.

ఆధ్యాత్మిక సోపానాలను అధిరోహించాలనుకొనే సాధకులు మొట్టమొదటగా తాము పాదం మోపవలసిన మొదటి మెట్టు పేరే కృతజ్ఞత.

మనలను భవబంధాల నుండి విముక్తి చెందేందుకు ఎంతో దయతో దారి చూపిన మహాత్ముని పట్ల కృతజ్ఞతతో తలవంచి నమస్కరించి ముందడుగు వేయటంతోనే సాధన ప్రారంభమౌతుంది. ఈ విషయాన్నే తన ఆచరణ ద్వారా శ్రీ అమ్మగారు మనకు బోధించారు.

శ్రీ అమ్మగారు మనకు బోధించిన మరొక మహోన్నతమైన విషయం కర్తవ్యనిష్ఠ.

మొదటగా మనిషికి తన వ్యక్తిగత జీవితం పట్ల, కుటుంబం, చుట్టూ వున్న సమాజం, దేశం – వీటి పట్ల మన కర్తవ్యం ఏమిటో స్పష్టమైన అవగాహన వుండాలని అమ్మగారు చెప్పేవారు.

మనిషికర్తవ్యంమొదటతననుతానుసంస్కరించుకొనటం. మహనీయులు చెప్పిన ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ, గమ్యం వైపు సాగాలన్నదే అత్యున్నతమైన లక్ష్యంగా నిర్ణయం తీసుకొనటం అనేది జన్మను తరింపజేస్తుందనీ, కనుక ఆ బాటలో నడిచేందుకు నిర్దుష్టమైన ప్రణాళిక ఏర్పరచుకొనటం మనిషి యొక్క ప్రథమ కర్తవ్యమని అమ్మగారు చెప్పేవారు.

తర్వాత కర్తవ్యం కుటుంబంపట్ల మనకున్న బాధ్యతలను ధర్మంగా, సక్రమంగా నిర్వర్తించటం. ఆధ్యాత్మిక జీవితమంటే ధ్యానము, జపము, పారాయణ, పూజలు – యిలాంటి కార్యక్రమాలు మాత్రమే శ్రద్ధగా నిర్వర్తించాలని, మిగతా లౌకిక విషయాలు అంతగా పట్టించుకోనవసరం లేదనీ భావించటం పొరపాటని అమ్మగారు అనేవారు. ఆధ్యాత్మికత పేరుతో కుటుంబంపట్ల తనకున్న బాధ్యతలను నిర్లక్ష్యం చేయటం మహాపాపం. ఋణానుబంధాలను గుర్తుంచుకొని కుటుంబసభ్యుల పట్ల మన బాధ్యతలను ధర్మంగా నిర్వర్తించటం అనేది కూడా ఆధ్యాత్మిక సాధనలో ఒక భాగమని ఆమె చెప్పేవారు.

మొదటగా కుటుంబ వ్యవస్థ గురించి చెపుతూ ఆమె యీ వ్యవస్థ యొక్క రూపురేఖలు పూర్వం ఎంత కట్టుదిట్టంగా, ఎంత పద్ధతిగా వుండేవో, యీనాటి పరిస్థితులు ఆ వ్యవస్థను ఎలా చిన్నాభిన్నం చేశాయో చెప్పేవారు.

ఇక –

మన చుట్టూ వున్న సమాజం పట్ల మన కర్తవ్యం విషయం గురించి ఆలోచిస్తే, కష్టాలలో వున్నవారికి మన చేతనైన సహాయం చేయటం మాత్రమే కాదు, మాస్టరుగారు ఆదేశించిన విధంగా సత్సంగాలు చేస్తూ, చుట్టూ వున్న

ఆధ్యాత్మిక సోపానాలను అధిరోహించాలనుకొనే సాధకులు మొట్టమొదటగా తాము పాదం మోపవలసిన మొదటి మెట్టు పేరే కృతజ్ఞత.

ప్రజలకు కూడా ఆధ్యాత్మికత, భక్తిమార్గం పట్ల అవగాహన కల్గించ యత్నించటం అవసరం. సమాజ శ్రేయస్సులోనే, ఆ సమాజంలోని ఒకరమయిన మన శ్రేయస్సు కూడా యిమిడి



వుంటుంది. కనుక సాముహికంగా అందరమూ కలసి లక్ష్యం పట్ల జాగరూకులమై వుండేందుకు యీ ప్రయత్నం దోహద పడుతుంది.

ఇతరులతో ఆధ్యాత్మిక సంభాషణలు చేసేటప్పుడు, సత్సంగాలు చేసేటప్పుడు – ఆ ప్రసంగాలు, ఆ కార్యక్రమాలు ఎంతో నిరాడంబరంగా, నిరహంకారంగా జరగాలని శ్రీ అలివేలు మంగామాత బోధించేవారు..!

తర్వాత విషయం దేశం పట్ల మన కర్తవ్యం. దేశభక్తి అనేది ప్రతి ఒక్కరి హృదయమంతా నిండి వుండాలి. మన దేశ సంస్కృతి అంతా ఆధ్యాత్మికత, దైవభక్తి అనే పునాదులపైననే ఏర్పడింది. యీ దేశంలో ఎందరో మహాత్ములు, సద్గురువులు, అవధూతలు అవతరించి, మనకు చక్కని ధర్మబోధ చేశారు. ఈ భారత భూమిలో పుట్టటమే మన భాగ్యం. ఈ దేశంలోని నదులు, వనాలు, సంపద, సంస్కృతి ఎంతో గొప్పవి. కానీ కాలక్రమేణా ప్రజల వైఖరులు, జీవన విధానాలు కలుషితమై పోతున్నాయి. కనుక మనలను మనం జాగృతం చేసుకొనవలసి వున్నది. అందుకోసం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రచారం, ధర్మబోధ జరగాలి. శ్రీమాస్టరుగారి రచనలు, ప్రబోధాలు యిప్పటికే పలుభాషలలోకి అనువదింపబడి ప్రజలను భక్తిమార్గం వైపు నడిచేలా అప్రమత్తం చేస్తున్నాయి. ప్రతి ఒక్కరూ కూడా తమను

శ్రీ మాస్టరుగారినే తన గురుదేవులుగా భావించి, ఆయన చెప్పిన మార్గంలో నడుస్తూ, తన జీవితంలోని ప్రతిక్షణము ఆయనకీ, ఆయన ఆశయపాలనకీ అర్పించారు.

తాము సంస్కరించుకొనే ప్రయత్నం మాత్రమేకాక తమ వంతు కృషిగా ధర్మప్రచార కార్యక్రమాలలో కూడా పాల్గొనాలి. మన చుట్టూ వున్న మన సమాజంలోనివారు, దేశంలోని ప్రజలు, అందరూ మనవారేననీ, అందరము ఒకే కుటుంబ సభ్యులము అన్న భావన పెంపొందించుకొనటానికి మనమంతా ప్రయత్నించాలి. సత్సంగాల ద్వారా ధర్మప్రచారానికి మన వంతు కృషి చేస్తూ, ధర్మప్రచారం, భక్తి ప్రచారం చేసేవారికి సహాయ సహకారా లందించాలి. దేశంలోని మహనీయులందరి బోధలు; దేశభక్తుల, స్వాతంత్ర్య సమర సమరయోధుల జీవిత చరిత్రలు చదువుతూ, పిల్లల చేతకూడ చదివిస్తూ, వారిని కూడా దేశభక్తి భావనలు పెంపొందించుకొనటంలో అప్రమత్తులను చేయటం ఎంతో అవసరం. నేటి బాలలే రేపటి పౌరులు కనుక ఉగ్గుపాలతోనే బాలలకు ధర్మము, దేశభక్తి గురించి బోధిస్తూ వుండాలి.

నేటి కాల పరిస్థితులకు, సమస్యలకు పరిష్కారంగా అవతరించి, తమ దివ్య బోధలందించిన శ్రీ మాస్టరుగారి, శ్రీ సాయినాథుని దివ్యోపదేశాలు సకల మానవాళి మేలు పొందేలాగ, ప్రపంచ వ్యాప్తంగా విస్తారంగా ప్రచారం చేయబడాలి. అందుకు మనవంతు కర్తవ్యంగా మనం ఏమి చేయాలో ప్రణాళికలను సిద్ధం చేసుకొనటం అవసరం.

ఇంతటి మహోన్నతవ్యక్తి, తన గురించి ఎవరి నుండీ ఎటువంటి గుర్తింపును ఆశించలేదు. "నాలో ఎలాంటి ప్రత్యేకతా లేదు, ఎటువంటి గొప్పతనము లేదు. కొందరు అనుకొంటున్నట్లు ఎలాంటి దివ్యత్వము లేదు. నేను ఒక సామాన్యురాలిని మాత్రమే!" అని తరచూ చెపుతుండేవారు.

ఇలా అమ్మగారు తరచూ భక్తజనులకు తన దివ్యబోధలు అనుగ్రహించేవారు.

పదహారేండ్ల చిన్న వయసులో జిల్లెళ్ళమూడి అమ్మలోని మహనీయతను చూచి ఆకర్షితురాలై భక్తిమార్గానికి, ఆధ్యాత్మికతకు అంకితురాలై, ఆ కఠినసాధనలో విజయాన్ని సాధించి, సమర్థ సద్గురులైన శ్రీ భరద్వాజ మాస్టరుగారి సహధర్మచారిణిగా స్థానాన్ని పొందిన మన మాతృదేవి ఆ తర్వాత జీవితమంతా మరింత అప్రమత్తతతో కర్తవ్యపాలన చేశారు. శ్రీ మాస్టరుగారినే తన గురుదేవులుగా భావించి, ఆయన చెప్పిన మార్గంలో నడుస్తూ, తన జీవితంలోని ప్రతిక్షణము ఆయనకీ, ఆయన ఆశయపాలనకీ అర్పించారు.

తన కుటుంబం పట్ల, బంధువుల పట్ల, రక్తసంబంధీకుల పట్ల మాత్రమేకాదు – తనను, శ్రీ మాస్టరుగారిని చేరవచ్చే భక్త జనులందరినీ తన కుటుంబ సభ్యులుగానే భావించారు. నామకరణాలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు, సీమంతాలు, వివాహాలు – యిలా ఎన్నెన్నో ఎందరికో తన స్వంత ఖర్చులతో నిర్వహించారు. ఆమె అందరినీ తన స్వంత బిడ్డలుగానే తలచారు. అంతా తన కుటుంబమే! అందరూ తనవారే! అంతేకాదు, పేదలకు ధన ధాన్య వస్త్ర దానాలు, భౌతిక సహాయాలు ఎన్నో చేసేవారు. ఇవికాక ఆమె చేసిన గుప్తదానాలు ఎన్నెన్నో!

ఇంతటి మహోన్నతవ్యక్తి, తన గురించి ఎవరి నుండీ ఎటువంటి గుర్తింపును ఆశించలేదు. "నాలో ఎలాంటి ప్రత్యేకతా లేదు, ఎటువంటి గొప్పతనము లేదు. కొందరు అనుకొంటున్నట్లు నాలో ఎలాంటి దివ్యత్వము లేదు. నేను ఒక సామాన్యురాలిని మాత్రమే!" అని తరచూ చెపుతుండేవారు. ఇలా ఆమె తనకంటూ ఎటువంటి ప్రత్యేక గౌరవాలు ఆశించక నిరహంకారంగా ప్రవర్తించేవారు. అతినిరాడంబరంగా జీవించారు. శ్రీ మాస్టరుగారి గొప్పతనాన్నే ఎల్లప్పుడూ చాటిచెపుతూ విశ్వపు వినువీధులలో శ్రీ మాస్టరుగారి కీర్తి పతాకను ఎగురవేస్తూ, 'ఆయన పాదాల క్రింద వున్న ఒక గడ్డిపువ్వును మాత్రమే నేను' అని భావించేవారు.

అయితే విశ్వాంతరాళంలో ఎగిరే శ్రీ మాస్టరుగారి కీర్తి పతాకం విరజిమ్మే కాంతికిరణాల రూపంలో సకల లోకాలనూ వెలిగిస్తూ, మన మాతృదేవి మన యిహపరాలకు ఆలంబనమై తన చల్లని ప్రేమను మనపై నిరంతరము వర్షిస్తూనే వుంటుంది.

అలాంటి దివ్యజనని శ్రీ అలివేలు మంగమ్మతల్లి దివ్యచరణారవిందములకు భక్తితో ప్రణమిల్లుదాం!! ●

ద్వారకామాయి అనుభవమండపము

~శ్రీమతి కృష్ణవేణి (ఒంగోలు)

1981 లో పూజ్యశ్రీ మాస్టరుగారి చేతుల మీదుగా సాయిలీలామృతం గ్రంథం తీసుకున్నాను. నాకు అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి ఏమీ తెలియదు. ఆ గ్రంథం తీసుకున్న కొద్ది కాలానికే మావారికి వేరే ఊరు బదిలీ అయింది. అందువల్ల నాకు పూజ్యశ్రీ మాస్టరుగారితో అనుబంధం లేదు. కానీ వారు రచించిన గ్రంథం, వారిచేతుల మీద తీసుకోవడం వల్లనేమో, చాలా బాగా పారాయణలు చేసుకున్నాను. మాది పెద్ద సంసారం. నాకు చిన్న పిల్లలతోను, ఇంటికి వచ్చే పోయే బంధువులతోను నిత్యము ఎంతో హడావిడిగా వున్నాకూడా, సప్తాహ పారాయణాలు (అప్పట్లో సాయి లీలామృత గ్రంథంలో సప్తహ పారాయణలే ఉండేవి), నాలుగు హారతులు, ప్రతినిత్యం సాయంత్రం బాబా గుడికి వెళ్లడం, ఇవన్నీ కూడా క్రమం తప్పక చేసుకునేదాన్ని. నాకు బాబా స్వప్నంలోను, భౌతికంగానూ కూడా దర్శనం ఇచ్చేవారు. తరచుగా రకరకాల తీపి పదార్థాలు చేసి నైవేద్యం చేసేదాన్ని. ఒకొక్కసారి స్వప్నంలో, ఫలానా స్వీట్ చేయమని అడిగేవారు. అది తప్పక చేసి నివేదించేదాన్ని.

అదేవిధంగా కాఫీ కూడా ఇవ్వమని అడిగేవారు. దానికి కారణం వుంది. నేను ప్రతీదీ 'సాయినాథార్పణమస్తు' అని తీసుకునేదాన్ని ఒక్క కాఫీ తప్ప! నేను రోజుకి చాలాసార్లు కాఫీ తాగేదాన్ని. నాకు కాఫీ అంటే చాలా ఇష్టం. ఇంట్లో వాళ్ళకోసం, ఇంటికి వచ్చే వాళ్ళకోసం కాఫీ కలపడం, వాళ్ళతో పాటూ నేనూ తాగడం! కానీ ఒక్కసారి కూడా బాబాకి సమర్పించేదాన్ని కాదు. కనీసం తాగేటప్పుడు కూడా బాబాని తలచుకునేదాన్ని కాదు.


ఒకరోజు ఉదయం 6-30 గంటల సమయంలో, మావారు ఇంటి బైట వరండాలో కుర్చీలో కూర్చుని వార్తాపత్రిక (న్యూస్ పేపర్) చదువుకుంటున్నారు. నేను ఒక పెద్దగ్లాసు నిండా కాఫీ తీసుకుని హాల్లోకి వచ్చేసరికి, ఒక పెద్దాయన వీధి గేటు తీసుకుని సరాసరి హాల్లోకి వచ్చారు. సుమారు అయిదున్నర అడుగుల ఎత్తువుంటారు. ముతక కోరా లాల్చీ, పంచె కట్టుకుని వున్నారు. వస్తూనే, చెంబుడు మంచినీళ్లు తాగి, అక్కడున్న కుర్చీలో కూర్చుని, కాఫీ ఇమ్మని నన్ను అడిగారు. అప్పుడే సిద్ధంగా పెట్టుకున్న కాఫీ ఇచ్చేసాను. అది తాగి గ్లాసు అక్కడ పెట్టేసి, ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోయారు. నేను వెంటనే బైటికి వచ్చి, "ఆ వచ్చినాయన మీకు తెలుసా?" అని మావారిని అడిగాను. "నాకేం తెలియదు, నీకు తెలిసిన వారేమో అనుకున్నాను" అని మావారన్నారు. వెంటనే ఇంటిచుట్టూ వెతికాను. ఎక్కడా కనపడలేదు. అప్పుడు "ఓహో! నేను రోజూ బాబా అడుగుతున్నా కాఫీ ఇవ్వకుండా తాగేస్తున్నాను. అందుకే ఈరోజు ఇలా వచ్చి, అడిగి మరీ తాగి వెళ్లారే!" అనుకున్నాను. ఆ రోజు నించి నాకు కాఫీ పట్ల వున్న వ్యామోహం పోయి కాఫీ వదిలేసాను. ఇది 1985, 86 సంవత్సరాలలో జరిగింది. ఇప్పటికీ నేను కాఫీ తాగడం లేదు.

నాకు ఇంట్లో పనివల్ల, చిన్నపిల్లలవల్ల, పారాయణలు, పూజల వల్ల తీరిక సమయం ఎక్కువగా ఉండేది కాదు. అందుకని ఇరుగుపొరుగు వాళ్ళతో మాట్లాడటానికి అవకాశం ఉండేది కాదు. ఒకరోజు బాబా స్వప్నంలో, నవ్వుకుంటూ మా ఇంట్లోకి వచ్చి సోఫాలో కూర్చుని, "నీ గురించి మీ చుట్టుపక్కలవాళ్ళు ఏమనుకుంటున్నారో తెలుసా?" అన్నారు. "ఏమనుకుంటున్నారు బాబా" అన్నాను. "నువ్వు బైటకి వెళ్లి చూడు" అన్నారు. నేను బైటకి రాగానే మా ఇంటి చుట్టూ

గోడలనిండా ఉర్దూలో, ఖాళీ లేకుండా ఏదో రాసివుంది. నాకు ఆ భాష రాక, లోపలికొచ్చి "అదేమిటి బాబా" అంటే, "అంతలా నీ గురించి అనుకుంటున్నారు" అన్నారు. "పోనిలే బాబా అనుకోనీ, నాకు నువ్వున్నావుగా" అన్నాను. స్వప్నం అయిపోయింది. మర్నాడు మా పక్కింటావిడతో, "నాకు ఇలా స్వప్నం వచ్చిందండి, అది నిజమేనా అనడిగితే", "నిజమేనండీ, 'ఆవిడకి చాలా గర్వం, ఎవ్వరితోనూ మాట్లాడదు' అని అందరూ అనుకుంటూ వుంటారు" అని చెప్పింది. అంటే ఆ విషయమే బాబా నాకు చెప్పారన్నమాట! అని భలే ఆశ్చర్యమేసింది.

ఒకసారి మా కోడలు పుట్టింటికి, మా అబ్బాయి శబరిమలైకి వెడితే, నేనొక్కదాన్నే ఇంట్లో వున్నాను. అలాంటప్పుడు నాకు తోడుగా ఒక అమ్మాయి పడుకుంటుంది. ఆ రోజు ఆ అమ్మాయి రాలేదు. సరేలే, బాబా ఉన్నారుగా అనుకుని నేనొక్క దాన్నే పడుకున్నాను. అర్ధరాత్రి 12 గంటలప్పుడు మెలకువ వచ్చింది. నా గదిలో నేను పడుకునే మంచం తల వైపు ఒక బాబా విగ్రహం ఉంటుంది, అందులోనించి గురక వినపడుతోంది. చాలా ఆశ్చర్యంగా అనిపించింది. కాసేపటికి మళ్ళీ నిద్ర పట్టింది. సరిగ్గా 2 గంటలప్పుడు మెలకువ వచ్చింది. అప్పుడు కూడా బాబా విగ్రహం నించి గురక వినపడుతోంది. నేనొక్క దాన్నే వున్నానని బాబా నాకు తోడుగా పడుకున్నారని తెలిసి నా మనసంతా కృతజ్ఞతతో నిండిపోయింది.

నాలుగేళ్ల క్రితం మేము సంతపేటలో వుంటున్నప్పుడు, ఒక గురువారం పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి పూలంగిసేవకి వెళ్లాను. ఆ రోజు బాగా ఆలస్యమయింది దాదాపు రాత్రి 10 గంటలవుతోంది. అందరూ వెళ్లిపోయారు. నేను ఆటో కోసం ఎదురు చూస్తున్నాను. ఏ ఆటో కూడా రావడం లేదు. సమయం 10-30 అయ్యింది. ఒక ఆటో అతను వచ్చాడు. నాకు దాదాపు ఒంగోలులో ఆటో వాళ్ళందరూ తెలుసు. ఎందుకంటే ప్రతి గురువారం, పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి ఆటోలో వచ్చి, తిరిగి ఆటోలో వెడుతూంటాను. ఇతను కొత్తవాడిలా వున్నాడు. కానీ బాగా ఆలస్యమైందని అతని ఆటో ఎక్కాను. ఖాకి బట్టలు వేసుకున్నాడు. కళ్ళు, జుట్టూ కూడా ఎర్రగా వున్నాయి. లోపల గుబులుగా వున్నా, బాబాని తలచుకుంటూ కూర్చున్నాను. అతను మధ్యలో ఆటో ఆపి, బీడీ కొనుక్కున్నాడు. నన్ను క్షేమంగా దింపుతాడా అని అనుమానమేసింది. నేను అతనికి సంతపేట అని మాత్రమే చెప్పాను, కానీ సరిగ్గా మా ఇంటిముందు ఆటో ఆపాడు.



నేనిచ్చిన డబ్బులుకూడా లెక్కపెట్టుకోకుండా జేబులో పెట్టుకుని వెళ్ళిపోయాడు. అతను వెళ్లిన కాసేపటికి నాకు ఆలోచన వచ్చింది, నేను ఇంటి అడ్రస్ చెప్పకుండా సరిగ్గా మా ఇంటి దగ్గర దింపాడూ అంటే, ఆ వ్యక్తి ఎవరై వుంటారా అని! అలా ప్రతి క్షణం ఆ సాయినాథుడు కంటికి రెప్పలా చూసుకుంటూనే వున్నారు, ఎప్పటికీ చూసుకుంటారు!!

ఆచార్యుని అద్భుత లీలలు

~డాక్టర్ (శ్రీమతి) రమాదేవి

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలా వైభవాన్ని కావలికి చెందిన డాక్టర్ రమాదేవిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు–

నేను, మావారు (డాక్టర్ నరసింహంగారు) -- ఇద్దరం వైద్యులం. కావలిలో మాకు నర్సింగ్ హోమ్ వుంది. ప్రతిరోజూ పేషెంట్స్ చాలామంది వస్తూ వుండేవారు. ఒకరోజు మావారి దగ్గరికి ఒక పేషెంట్ వచ్చారు. ఆయన శ్రీ ఎక్కిరాల వేదవ్యాసగారి శిష్యుడు. ఆయన ద్వారా శ్రీ వేదవ్యాసగారి గురించి తెలియడము, తద్వారా పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి తెలియడం జరిగింది.

తరువాత కొన్నిరోజులకు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం కోసం ఒంగోలు వెళ్ళాము. మేము ఆసుపత్రి పనులు పూర్తిచేసుకుని ఒంగోలు వెళ్లేసరికి బాగా చీకటి పడింది. బహుశా రాత్రి 8:30 గంటలవుతోంది. చాలా ఆలస్యమయిందని అనుకుంటూనే లోపలకి వెళ్ళాము. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో ఆప్యాయంగా పలకరించారు. చాలాసేపు చాలా విషయాలు చెప్పారు. హాయిగా, సరదాగా మాట్లాడుకుని తృప్తిగా ఇంటికి వచ్చాం.

ఆ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఆహ్వానం మేరకు మా ఇంటికి వచ్చారు. మా ప్రపంచం అంతా మాస్టరుగారి మయంగా వుండేది. మా ఊరి మీదనించి పూజ్యశ్రీ మాస్టరుగారు ఏ వూరు వెళ్లినా, మేము ఆ విషయం తెలుసుకుని బస్టాండుకి వెళ్లి వారిని దర్శించుకొని నమస్కారం చేసుకునేవాళ్ళం. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని, "మాకు సత్సంగం కోసం మందిరం నిర్మించుకోవాలని వుంది మాస్టరుగారూ!" అని అడిగాము. ఆయన అపార కరుణతో మాకు అనుమతి, ఆశీర్వచనమూ ఇచ్చారు. ఒకాయన ఎప్పటినించో స్థలం ఇస్తానంటున్నారు కానీ ఇవ్వటం లేదు. ఈలోగా టంగుటూరి ప్రసాదుగారు, "మా స్థలం వుంది తీసుకోండి, కానీ అందులో మా అమ్మగారి అస్థికలు వున్నాయి" అని చెప్పారు. అక్కడ వారి తల్లిగారి అస్థికలు చిన్న కుండలో పెట్టి, భూమిలో పెట్టి దానిమీద చిన్న అరుగు కట్టారు. మేము ఆ సంగతి పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పాము. "బాబాకి ఏమీ ఫరవాలేదు, కానీ మామూలు వాళ్లకి అభ్యంతరముంటుంది కదా! గుడి అంటే అందరూ వస్తుంటారు కదా! నేను వచ్చి స్థలశుద్ధి చేయిస్తాను. ప్రసాదుగారి అమ్మగారికి సద్గతి కలగాలని మీరు బాబాకి చెప్పుకోండి" అని చెప్పారు. అనుకున్నట్లుగానే పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చారు. మేము సాయంత్రం నాలుగు గంటలకు స్థలానికి వెళ్ళాము. కూలీలు వచ్చి ఆ అరుగుని కొంచెం త్రవ్వారు. ఇక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు అద్భుతమైన లీల చేశారు! అప్పటికప్పుడు కుంభవృష్టి పడింది. ఆ వర్షపు నీటిలో తడిసి మట్టిఇటుకలన్నీ కరిగిపోయి దానికింద వున్న ముంత బైటపడింది. పూజ్యశ్రీ మాస్టరుగారు దానిని సముద్రంలో కలిపి రమ్మన్నారు. ప్రకృతే స్థలశుద్ధి చేసినట్లు అయ్యింది. తరవాత మేము అక్కడ ఒక చిన్న మందిరము, ధుని కట్టుకున్నాము. పూజ్యశ్రీ మాస్టరుగారు చిత్రమైన రీతిగా శిరిడీలోని ధుని తెచ్చి దీనిలో కలిపిన లీల అందరికీ తెలిసినదే!

మాకు ప్రతిసారి నవంబరులో తుఫాను వస్తుంది. అలాగే ఆ సంవత్సరం కూడా వచ్చింది. ఎవ్వరూ ఇంటినించి బయటికి రాలేని పరిస్థితి. మాకు చాలా భయమేసింది.

'ధుని ఎలావుందో!! చుట్టూ మట్టితో కట్టాము. ఈ వర్షానికి కూలిపోతుందేమో!' అని భయపడ్డాము. వర్షం వెలిశాక చూస్తే ధుని ఆరిపోకుండా వెలుగుతూనేవుంది!! గోడకి కూడా ఏమీ కాలేదు! కానీ ఆ పక్కనే వున్న RTCవాళ్ళ ప్రహరీ గోడ కూలిపోయింది. పూజ్యశ్రీ మాస్టరుగారి, సాయినాథుల వారి ఆశీస్సుల ఫలితం ఎంత గొప్పదో!!

మాకు బాబాకు గంధోత్సవం(ఉరుసు) చేసుకోవాలనిపించి పూజ్యశ్రీ మాస్టరుగారిని అనుమతి కోరాము. "సత్సంకల్పానికి బాబా ఆశీస్సులు తప్పకుండా వుంటాయమ్మా!" అన్నారు. మాకు ముస్లిం పేషెంట్స్, స్నేహితులు వున్నారు. వాళ్ళ సహాయంతో ఈ కార్యక్రమం 1986లో మొదలుపెట్టాము. మా దగ్గరకు డబ్బై, ఎనభై కిలోమీటర్ల దూరంనుంచి ఫకీర్లు వచ్చేవారు. మాకు ముస్లిం టైలర్ వుండేవాడు. అతని ఇంట్లో అందరికీ విందు ఏర్పాటు చేసేవాళ్ళము. సాయిలీలామృతంలో చెప్పినట్లే చేసేవాళ్ళం. ఆ రోజు ఉదయమే ఇంట్లో అందరం తలస్నానం చేసి గంధం తీసేవాళ్ళం. దాన్ని ఫకీర్లు తీసుకువచ్చే గంధంలో కలిపేవాళ్ళం. ఒక ట్రాక్టర్ని రథంగా చేసి తాజుద్దీన్ బాబా ఫోటో, మాస్టరుగారి ఫోటో పెట్టి ఊరేగింపుగా గుడికి తీసుకుని వెళ్ళేవాళ్ళం. తాజుద్దీన్ బాబా ఫోటో కూడా చాలా చిత్రంగా వచ్చింది. మేము 'వాకీ' వెళ్ళినప్పుడు మందిరం కోసమని తాజుద్దీన్ బాబా పటం తెచ్చుకుని, ఇంట్లో నలభై రోజులు పారాయణ చేసాము. ఇది మందిరం ఫోటో కదా అక్కడే ఇచ్చేద్దాం అని నైవేద్యం పెట్టి, కారులో బయలుదేరాము. అప్పుడు మావారన్నారు, "గుడిలో పెట్టాక ప్రసాదం కావాలి కదా!" అని. ఇంట్లోకి వెళ్లి ప్రసాదం తెచ్చి బయలుదేరదామని అనుకుంటుంటే మా కారు టైరు పంక్చర్ అయింది.

ఇక తాజుద్దీన్ బాబాని ఇంట్లోకి తీసుకువచ్చేసాం, మందిరానికి తీసుకువెళ్ళలేదు. ఆ ఫోటోనే ప్రతి సంవత్సరం ఉరుసు ఉత్సవానికి గుడికి తీసుకుని వెళతాము. ఉరుసు ఉత్సవానికి మాకు ప్రేరణ కలిగించి, తాజుద్దీన్ బాబాని కూడా రప్పించి ఈ కార్యక్రమం మాచేత పూజ్యశ్రీ మాస్టరుగారే చేయించారని మా నమ్మకం. ఇంట్లో శ్రీరామనవమి కూడా జరుపుకునేవాళ్ళం.

1989 ఏప్రిల్ 1వ తేదీన మా కుటుంబమంతా పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లాం. మమ్మల్ని పల్లకీ సేవకి గుడికి వెళ్లిరమ్మన్నారు. గుడినుంచి వచ్చాక పూజ్యశ్రీ



మాస్టరుగారితో కలిసి అందరమూ భోజనాలు చేసాము. అదే మాకు పూజ్యశ్రీ మాస్టరుగారితో కలసి ఆఖరి భోజనం అవుతుందని తెలియలేదు. మళ్ళీ ఏప్రిల్ 11 న మావారు, మా అమ్మ కలిసి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లారు. నెల్లూరులో మా అమ్మవాళ్లకి కొంత పొలం వుంది. అది కొంచెం చికాకులలో వుంది. దాని నిమిత్తం మా అమ్మని తీసుకుని ఏలూరు వెడుతూ పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సులు తీసుకుని వెళదామని ఒంగోలులో దిగారు. సాయంత్రం సమయం... పూజ్యశ్రీ మాస్టరుగారికి అప్పుడే కొంచెం గుండె నొప్పివచ్చి తగ్గిందిట. మావారితో అంతా బాగానే వుందని చెప్పారట. ఈయన వచ్చినపని కనుక్కుని ఆశీస్సులిచ్చి పంపించారట. అయినా మావారు ఒంగోలులో వున్న ఈయన స్నేహితుడైన ఒక డాక్టరగారిని కలుసుకుని విషయం చెప్పి పూజ్యశ్రీ మాస్టరుగారిని చూసిరమ్మని చెప్పారుట. ఆ డాక్టరుగారు, ఆరోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరికి వెళితే, ఆయన తనకు తగ్గిపోయిందని చెప్పారుట. కానీ మర్నాడు జరగవలసింది జరిగిపోయింది!!! మావాళ్లకి పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సుల ఫలితంగా వాళ్ళు వెళ్ళిన పని చాలా సునాయాసంగా జరిగిపోయింది. అది పూజ్యశ్రీ మాస్టరుగారు దేహంతో వుండగా మాకు ఇచ్చిన చివరి ప్రసాదం!

మేము ఎప్పుడు ఒంగోలు వెళ్లినా ఎదురుగా కనిపించే పూజ్యశ్రీ మాస్టరుగారు తరవాతి కాలంలో కనిపించకపోవడం చాలా బాధగా వుండి పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం చేయించాలనిపించింది. నెల్లూరులో శిల్పి వున్నాడని తెలిసి అతనికి పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం చేయడానికి పురమాయించాము. విగ్రహం పూర్తయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో ప్రతిష్టించాము. ఆ కార్యక్రమం జరిగిన కొన్నాళ్ళకి ఆ శిల్పి, 'మీరు కోరిన విగ్రహం పూర్తయింది, వచ్చి తీసుకెళ్లమ'ని కబురు చేసాడు. మాకు అర్ధం కాలేదు, మేము విగ్రహం ఇంతకుముందే తీసేసుకున్నాము కదా అని! సరేనని వెళ్ళాము. అది పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం. అప్పుడతను ఇలా చెప్పాడు. ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి విగ్రహం తీసుకుని వెళ్లినప్పుడు, అక్కడి వాళ్ళు, 'ఇది వయస్సు ఎక్కువగా వున్నట్లు కనపడుతోంది!' అనుకున్నారట. అందుకని ఇప్పుడు కొంచెం వయసులో వున్నట్లు తయారుచేశారు. సరే, ఇదికూడా పూజ్యశ్రీ మాస్టరుగారి సంకల్పమేమో అనుకుని మా ఇంటికి తెచ్చుకున్నాము. ప్రతిరోజూ, అన్నివేళలా, అన్ని నైవేద్యాలు, సేవలు చేసుకొవడం మొదలుపెట్టాము.. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారు నిత్యసత్యులై వున్నారని అందరికీ అనుభవాలిచ్చారు. ఆ రకంగా పూజ్యశ్రీ మాస్టరుగారు, తనంతట తానే మా ఇంటికి వచ్చారన్నమాట!!

మేము చాలా చిత్రంగా పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగార్ల కళ్యాణం చేయ తలపెట్టాము. ఆరోజు మార్చి 6, 2007. నేను మా అమ్మాయితో, "పెద్దాపురం వాళ్ళు ఈరోజు కళ్యాణం బాగా చేస్తారు కదా!" అన్నాను. వెంటనే మా అమ్మాయి, "మనం కూడా చేసుకుందాం!" అంది. అంతే!! వెంటనే అప్పటికప్పుడు, అత్యుత్సాహంతో అన్నీ సమకూర్చుకుని, మా ఇంట్లో కూడా కళ్యాణం చేసుకున్నాము. అది అలా ప్రతి సంవత్సరమూ ఆ ఉత్సవం మరింత పెద్దదవుతూ మగపెళ్లివారు, ఆడపెళ్ళివారు, విడిది, బాజా భజంత్రీలు... ఇవన్నీ క్రమంగా ఏర్పడి ప్రతి సంవత్సరం అంగరంగవైభవంగా జరుపుకుంటున్నాము.

అదేవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలైన ఏదినిజం?, విజ్ఞానవీచికలు, మతం ఎందుకు?.. ఇవన్నీ, మా వూరు కళాశాల గ్రంథాలయంలో పెట్టించాము. కళాశాల విద్యార్థులచేత ఈ పుస్తకాలు, వివేకానందస్వామి పుస్తకాలపై పోటీ పరీక్షలు కూడా నిర్వహించేవాళ్ళం. వీటన్నిటి వెనుక పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రోత్సాహము, ప్రేరణ మెండుగా వుండేవి.

పూజ్యశ్రీ మాస్టరుగారితో యాత్రలకి వెళ్లడం... మా జీవితాలలో మరచిపోలేని మధుర స్మృతులు. ఇలా ఎన్ని చెప్పుకున్నా ఇంకా మిగిలే వుంటాయి. పూజ్యశ్రీ మాస్టరుగారితో వుంటే ఆ ఉత్సాహమే వేరు, ఆ ఆనందమే వేరు!! అది ఇక ఎక్కడా, ఎవ్వరి దగ్గరా దొరకదు. ఆనందసాగరమే ఆయన!!

అటువంటి మహాత్ముని సన్నిధిభాగ్యం లభించడం కొన్ని కోట్ల జన్మల పుణ్యఫలమై వుండాలి. ఇప్పటికి అటువంటి ప్రేమను అందిస్తూ వారు, వారి కుటుంబము మమ్మల్ని కాపాడుతున్నారు. జన్మజన్మలకూ మాకు అనురక్తితో కూడిన భక్తిని, సేవను, ప్రసాదించమని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఈ అవకాశాన్ని నాకు ప్రసాదించినందుకు కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలి సమర్పించుకుంటున్నాను.

ఓం ఆనందసాగరాయ శ్రీభరద్వాజాయ నమః!

మహనీయుల సమాధుల ప్రభావం

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మహనీయులు మరణించాక గూడ వారి దేహాలు పరమ పవిత్రమైనవే. అందుకే జీవన్ముక్తుల దేహాలను దహనం చేయక సమాధిచేసి, పరమపవిత్రంగా పూజించడమన్నది అన్ని మతాల ఆచారంగా వున్నది. ఇది కేవలమొక విశ్వాసం మాత్రమే గాదు. ఆ సన్నిధిలో మానవుని ప్రార్థనలు భగవంతుని నుండి అనుగ్రహాన్ని త్వరగా పొందుతాయన్నది నిస్సందేహం. అన్ని మతాలకు చెందిన వేలాది ప్రజల అనుభవం గూడ.

కొన్ని శతాబ్దాల క్రింద పరమపదించిన మహనీయుల సమాధుల వద్ద – శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సమాధి, మంత్రాలయ రాఘవేంద్రుల సమాధి, నాగూర్ వల్లి సమాధి ఇలా ఎన్నో ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో ఆ సన్నిధిలో సాధకులు ప్రత్యేక భగవదాదేశం పొంది దాని సహాయంతో వారు గూడ పూర్ణపురుషులుగా రూపొందిన విషయం చరిత్రలో చూడవచ్చు. ఏదో ఒక





శుభసమయంలో ప్రాణ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠలతో మానవులు మలచిన విగ్రహాలు శక్తివంతాలవుతాయని శాస్త్రం చెబుతుంటే, జీవితాంతమూ అణువణువూ పవిత్రమై, వారనుభవించిన భగవదైక్యంలో పరమ పావనమైన మహనీయుల సమాధులు, చిరకాలం శక్తివంతాలవడంలో ఆశ్చర్యం ఏమున్నది? ఎందరో అవిశ్వాసులకు గూడ పరివర్తన కల్గించగల్గిన ప్రభావం అక్కడ ప్రకటమైన వుదంతాలెన్నో! ●

(చీరాల వాస్తవ్యులు ఆర్. భారతీదేవిగారు అడిగిన, **"మహనీయులు నిర్యాణం చెందిన తర్వాత వారి శరీరం పవిత్రమైనదేనా ?"** అన్న ప్రశ్నకు పూజ్య ఆచార్యుల వారి జవాబు. **పరిప్రశ్న** గ్రంథం నుండి సేకరణ.)

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

శ్రీ సాయిలీలామృతం-శ్రీ గురుచరిత్ర	450-00
శ్రీ సాయి లీలామృతము	150-00
శ్రీ గురు చరిత్ర	150-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రబోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్తవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము-భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	50-00
ఏది నిజం?	50-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహాత్మ్యం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి-ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాల స్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి)	49-00
మనము-మన సంస్కృతి	70-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master(Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2)	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాష్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba(Hindi)	150-00
Sai Leelamrutham(Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham(Malayalam)	220-00
Sai Baba Leelamrutham(Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	99-00
Sri Guru Charitra (Kannada)	45-00
Shiridi Aarathi(Tamil)	15-00
Stavana Manjari(Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra(Kannada)	55-00
Sri Sainatha Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, Sri Manga Bharadwaja Trust,

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad -500068
Phone : 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapeta, Ongole,
Prakasam Dt., Andhra Pradesh - 523002
Phone: 08592 233271
Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad OR Ongole.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.



పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ జన్మదినోత్సవము (01-10-2022)

పూజ్య భరద్వాజ గురుదేవుల జయంతి

30-10-2022 (ఆంగ్ల కాలమాన ప్రకారము)

31-10-2022 (హిందూ కాలమాన ప్రకారము - కార్తీక శుద్ధ సప్తమి)